నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X బెంగళూరు

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు) 379 (8 మ్యాచ్‌లు)	బుమ్రా (ముంబై) 13 (8 మ్యాచ్‌లు)

టీ20 వరల్డ్‌కప్ అంబాసిడర్
బోల్ట్



దుబాయ్: టీ20 వరల్డ్ కప్‌నకు స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం ప్రకటించింది. జూన్ ఒకటి నుంచి జరిగే పొట్టి కప్‌ను అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బోల్ట్‌కున్న క్రేజ్.. టోర్నీ పాపులారిటీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్టు ఐసీసీ తెలిపింది. ఉసేన్‌కు కూడా క్రికెట్ అంటే ప్రత్యేకమైన అభిమానం. వెస్టిండీస్ ఆటగాళ్లతో అతడికి మంచి సంబంధాలున్నాయి. వ్యక్తిగతంగా ఎంతో సరదాగా ఉండే బోల్ట్.. మరి ప్రచారకర్తగా అభిమానుల్లో ఎంతటి జోష్ నింపుతాడో చూడాలి.

సెహ్వాగ్ లెవెన్‌లో..
పాండ్యాకు దక్కని చోటు!



న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తన టీ20 వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాడు. అయితే, ఇందులో హార్దిక్ పాండ్యాకు చోటు దక్కక పోవడం ఆశ్చర్యం కలిగించింది. ఐపీఎల్ కామెంట్రీ సందర్భంగా.. సెహ్వాగ్ అయితే ఎవరికి జట్టులో చోటు కల్పిస్తాడని సహచర వ్యాఖ్యాతలు గిల్ క్రిస్ట్, మైఖేల్ వాన్ అడిగారు. దీంతో 'జైస్వాల్, రోహిత్, కోహ్లీ, సూర్యకుమార్, పంత్, రింకూ లేదా దూబే, బుమ్రా, సిరాజ్, సందీప్ శర్మ, కుల్దీప్ యాదవ్, జడేజా' అంటూ తన జట్టును చెప్పుకొచ్చాడు. వీరిలో పాండ్యా లేకపోవడంతో వారు అవాక్కయ్యారు. అయితే, హాస్య చతురత కలిగిన సెహ్వాగ్.. 15 మందిలో పాండ్యా ఉంటాడని నవ్వులు పూయించాడు.

పంత్ పటాకా

4 పరుగులతో ఢిల్లీ విజయం
రిషభ్, అక్షర్ అర్ధసెంచరీలు
పోరాడి ఓడిన గుజరాత్



పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్)

1 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులిచ్చిన (0/73) బౌలర్‌గా మోహిత్ శర్మ

2 చివరి ఐదు ఓవర్లలో ఎక్కువ పరుగులు (97) సాధించిన రెండో జట్టుగా ఢిల్లీ. బెంగళూరు (112) ముందుంది.

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ప్రతీ మ్యాచ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగుతూ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. 225 పరుగుల భారీ ఛేదనలోనూ గుజరాత్ టైటాన్స్ పట్టు వదలకుండా పోరాడి.. ఆఖరి బంతి వరకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వణుకు పుట్టించింది. కానీ సిక్సర్ బాదితేనే విజయం దక్కే పరిస్థితిలో టైటాన్స్ తడబడడంతో ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగు పరుగుల తేడాతో ఊపిరిపీల్చుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రిషభ్ పంత్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 88 నాటౌట్) విధ్వంసంతో ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 66), స్టబ్స్ (7 బంతుల్లో 26 నాటౌట్) వేగంగా ఆడారు. సందీప్ వారియర్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసి ఓడింది. సుదర్శన్ (23 బంతుల్లో 65), మిల్లర్ (23 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) అర్ధసెంచరీలు చేయగా.. రషీద్ (21 నాటౌట్) ఆఖర్లో పోరాడాడు. రసిక్ సలామ్‌కు 3, కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పంత్ నిలిచాడు.

పోరాటం సరిపోలేదు..: భారీ ఛేదనలో గుజరాత్ అసమాన పోరాటాన్ని ప్రదర్శించింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గిల్ (6) వెనుదిరిగినా.. సాహా, సుదర్శన్, మిల్లర్, రషీద్‌ల బ్యాటింగ్ తీరుతో మ్యాచ్ ఇరువైపులా దోబూచులాడింది. కానీ చివర్లో అదృష్టం ఢిల్లీనే వరించింది. వన్‌డౌన్ బ్యాటర్ సాయిసుదర్శన్, ఓపెనర్ సాహా ఆరంభంలో వేగంగా ఆడేస్తూ 49 బంతుల్లోనే రెండో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో జట్టు 67/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. పదో ఓవర్‌లో సాహాను కుల్దీప్ అవుట్ చేయగా.. 29 బంతుల్లోనే సుదర్శన్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఈ దశలో స్వల్ప వ్యవధిలోనే టైటాన్స్ వికెట్లను కోల్పోయింది. ఒమర్జాయ్ (1)ను అక్షర్ అవుట్ చేయగా.. పేసర్ రసిక్ వరుస ఓవర్లలో సుదర్శన్, షారుక్ (8)లను అవుట్‌చేసి షాకిచ్చాడు. దీనికి తోడు 16వ ఓవర్‌లో హిట్టర్ తెవాటియా (4)ను కుల్దీప్ పెవిలియన్‌కు చేర్చడంతో 152/6తో గుజరాత్ ఓటమి దిశగా పయనించింది. కానీ ఓవైపు క్రీజులో మిల్లర్ ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. దీనికి తగ్గట్టుగానే అతడు నోకియా (17వ) ఓవర్‌లో 4,6,6,6తో 24 రన్స్ రాబట్టడంతో ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అలాగే 21 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. ఈ స్థితిలో పేసర్ ముకేశ్ జట్టుకు రిలీఫ్‌నిస్తూ మిల్లర్‌ను సాగనంపాడు. చివరి 12 బంతుల్లో 37 పరుగులు రావాల్సి ఉండడంతో సాయికిశోర్ (13) రెండు సిక్సర్లతో వణికించినా.. రసిక్ అతడిని బౌల్డ్ చేశాడు. సమీకరణం ఆరు బంతుల్లో 19 రన్స్‌కి మారడంతో రషీద్ 4,4,6తో గుబులు రేపాడు. అయినా ఆఖరి బంతికి సిక్సర్ రాకపోవడంతో ఢిల్లీ సంబరాల్లో మునిగిపోయింది.

పంత్-పటేల్ శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పవర్‌ప్లేలోనే ఫ్రేజర్ (23), పృథ్వీ షా (11), హోప్ (5)ల వికెట్లను కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన అక్షర్ పటేల్ దుమ్మురేపారు. అలాగే డెత్ ఓవర్లలో పంత్ ధాటికి టైటాన్స్ బౌలర్లు పూర్తిగా గతి తప్పారు. వార్నర్‌ను బెంచీకే పరిమితం చేయడంతో షాకు జతగా ఫ్రేజర్ ఓపెనర్‌గా వచ్చాడు. స్కోరు 3 ఓవర్లలోనే 34కి చేరింది. కానీ పేసర్ సందీప్ వారియర్ గట్టి షాకిస్తూ నాలుగో ఓవర్‌లో ఫ్రేజర్, షాలను అవుట్ చేసి, తన తర్వాతి ఓవర్‌లోనే హోప్‌ను సైతం వెనక్కి పంపాడు. అయితే టైటాన్స్ సంతోషాన్ని ఆవిరి చేస్తూ పంత్-పటేల్ జోడీ మరో 11 ఓవర్లపాటు నిలకడగా క్రీజులో నిలిచింది. 12వ ఓవర్‌లోనే స్కోరు వంద దాటింది. 16వ ఓవర్‌లో పంత్ రెండు సిక్సర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో అక్షర్ సైతం రెండు వరుస సిక్సర్లతో విరుచుకుపడినా స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు చిక్కాడు. దీంతో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. పంత్ 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన సమయంలో డీసీ స్కోరు 180 ఖాయంలా కనిపించింది. కానీ 19వ ఓవర్ స్పిన్నర్ సాయికిశోర్‌కు ఇవ్వడంతో స్టబ్స్ చెలరేగి 22 పరుగులు రాబట్టాడు. ఇక ఆఖరి ఓవర్‌లోనైతే పంత్ వీరంగం సృష్టిస్తూ.. 6,4,6,6,6తో ఏకంగా 31 పరుగులు రాబట్టడంతో ఢిల్లీ స్కోరు అవలీలగా 220 దాటేసింది. దీంతో టైటాన్స్ చివరి 12 బంతుల్లోనే 53 పరుగులిచ్చుకున్నట్టయ్యింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) నూర్ (బి) వారియర్ 11, ఫ్రేజర్ (సి) నూర్ (బి) వారియర్ 23, అక్షర్ (సి) కిషోర్ (బి) నూర్ 66, హోప్ (సి) రషీద్ (బి) వారియర్ 5, పంత్ (నాటౌట్) 88, స్టబ్స్ (నాటౌట్) 26, ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం: 20 ఓవర్లలో 224/4; వికెట్ల పతనం :** 1-35, 2-36, 3-44, 4-157; **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-33-0, సందీప్ వారియర్ 3-0-15-3, రషీద్ ఖాన్ 4-0-35-0, నూర్ అహ్మద్ 3-0-36-1, మోహిత్ 4-0-73-0, షారుఖ్ 1-0-8-0, సాయి కిషోర్ 1-0-22-0.

లఖ్‌నవూ: సాహా (సి) అక్షర్ (బి) కుల్దీప్ 39, గిల్ (సి) అక్షర్ (బి) నోకియా 6, సాయి సుదర్శన్ (సి) అక్షర్ (బి) రసిక్ 65, ఒమర్జాయ్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 1, మిల్లర్ (సి) రసిక్ (బి) ముకేష్ 55, షారుక్ (సి) పంత్ (బి) రసిక్ 8, తెవాటియా (సి) పంత్ (బి) కుల్దీప్ 4, రషీద్ ఖాన్ (నాటౌట్) 21, సాయి కిషోర్ (బి) రసిక్ 13, మోహిత్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం: 20 ఓవర్లలో 220/8; వికెట్ల పతనం:** 1-13, 2-95, 3-98, 4-121, 5-139, 6-152, 7-181, 8-206; **బౌలింగ్:** ఖలీల్ 2-0-26-0, నోకియా 3-0-48-1, రసిక్ సలామ్ 4-0-44-3, ముకేష్ 4-0-41-1, అక్షర్ 3-0-28-1, కుల్దీప్ 4-0-29-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
ముంబై	8	3	5	0	6	-0.227
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

కళ్లన్నీ ఆ ఇద్దరి పైనే!



హెడ్

- విరాట్, హెడ్ కట్టడికి వ్యూహాలు
- ఫేవరెట్ సన్‌రైజర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సొంతగడ్డపై మరోసారి పరుగుల సునామీని సృష్టించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు సిద్ధమవుతున్నారు. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడేందుకు కమిన్స్ సేన తన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంది. కొద్ది రోజుల కిందట ఆర్‌సీబీను వారి హోంగ్రౌండ్‌లో ఓడించిన ఎస్‌ఆర్‌హెచ్, అదే ఊపుతో మరోసారి ఆధిపత్యం చెలాయించాలని తహతహలాడుతోంది. హెడ్, క్లాసెన్, మార్‌క్రమ్, అభిషేక్, సమద్, నితీశ్ రెడ్డితో ప్రత్యర్థులను హడలెత్తిస్తున్న సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డుప్లెసి నాయకత్వంలోని ఆర్‌సీబీ బ్యాటింగ్ ఆర్డర్ విరాట్, గ్రీన్, రజత్, దినేశ్ కార్తీక్‌తో బాగానే ఉన్నా, పేలవమైన బౌలింగ్ యూనిట్ వల్ల వరుస పరాజయాలను ఎదుర్కొంటోంది. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో టాప్‌లో ఉన్న విరాట్ కోహ్లీ, భీకర ఫామ్‌లో ఉన్న ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ బ్యాటింగ్‌పైనే అందరి దృష్టి నెలకొంది. విరాట్ ఉప్పల్‌లో ఆడిన 7 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 139.73 స్ట్రయిక్ రేట్‌తో 313 పరుగులు చేశాడు.

థ్యాంక్ గాడ్..బతికిపోయా!



కరాచీ: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఆ జట్టు నమ్మశక్యంగాని రీతిలో ఆడుతోందని చెప్పాడు. 'ముందుగా నేనీ తరంలో క్రికెట్ ఆడనందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 20 ఓవర్లలో 270 పరుగులు సాధించడమా? వన్డేల్లో అయితే ఇది 450-500తో సమానం. ఒకసారి కాకుండా ఇప్పటికి 3-4 సార్లు ఇలాగే బాదేశారు. మరీ 5 ఓవర్లలో వంద పరుగులు చేయడమైతే అన్యాయం. ఎంత ఫుల్‌టాస్‌లో బంతులు వేసినా ఇన్ని రన్స్ సాధించడం కష్టం. పాపం ఈ ఫార్మాట్‌లో బౌలర్లను చూస్తేనే జాలేస్తోంది' అని వసీం చెప్పుకొచ్చాడు.

27 నుంచి ఆసియా యూత్ బాక్సింగ్ పోటీలు

న్యూఢిల్లీ: ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బాక్సర్ల బృందాన్ని జాతీయ సమాఖ్య బుధవారం ప్రకటించింది. కజకిస్థాన్‌లోని అస్తానాలో ఈనెల 27 నుంచి జరగనున్న ఈ పోటీల్లో 25 మంది భారత బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు. పారిస్ ఒలింపిక్ బెర్త్ సాధించిన ప్రీతి పవార్ ఈ పోటీల్లో భారత బృందాన్ని నడిపించనుంది. ప్రీతి 54 కిలోల విభాగంలో తలపడనుండగా, అల్ఫియా పఠాన్ (81 కి.), ప్రస్తుత యూత్ వరల్డ్ చాంపియన్స్ దేవిక (52 కి.), విశ్వాంత్ సురేష్ (48 కి.), జాతీయ సీనియర్ చాంపియన్ ప్రాచి (63 కి.) తదితరులు బరిలోకి దిగుతున్నారు.

ఫైనల్లో జ్యోతి సురేఖ జట్టు

● పురుషుల టీమ్ కూడా.. ● ఆర్చరీ వరల్డ్‌కప్



షాంఘై: వరల్డ్‌కప్ కాంపౌండ్ ఆర్చరీలో జ్యోతి సురేఖ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. పురుషుల టీమ్ కూడా తుది పోరుకు చేరుకొంది. మరోవైపు రికర్వ్ విభాగం క్వాలిఫికేషన్ రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర జాతీయ రికార్డుతో మెయిన్ కాంపిటీషన్‌కు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన కాంపౌండ్ సెమీస్‌లో సురేఖ, అదితి గోపీచంద్, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 235-230తో ఎస్తోనియా టీమ్‌పై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో ఇటలీతో వరల్డ్ చాంప్ భారత్ తలపడనుంది. కాగా, అభిషేక్ వర్మ, ప్రియాన్ష్, ప్రథమేష్‌లతో కూడిన పురుషుల జట్టు 235-233తో కొరియా జట్టుపై నెగ్గింది. స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్‌తో టీమిండియా తలపడనుంది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం అర్హత రౌండ్‌లో ధీరజ్ 693 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి.. ప్రధాన పోటీకి అర్హత సాధించాడు. ఈ క్రమంలో తరుణ్‌దీప్ రాయ్ (689 పాయింట్లు) జాతీయ రికార్డును ధీరజ్ అధిగమించాడు.

కోటక్ మహీంద్రా బ్యాంక్‌పై
ఆర్‌బీఐ కొరడా

కొత్త క్రెడిట్ కార్డుల జారీపై నిషేధం.. కొత్త కస్టమర్ల చేరికలపైనా వేటు
ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ లేకపోవటంతో చర్యలు



ముంబై: ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోతే ఎంతటి పెద్ద బ్యాంకునైనా ఉపేక్షించేది లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేస్తోంది. ఈ రెండు కారణాలతో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం కోటక్ మహీంద్రా బ్యాంక్ (కేఎంబీ) కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా నిషేధం విధించింది. అంతేకాకుండా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చానల్స్ ద్వారా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోకుండా వేటు వేసింది. బ్యాంక్ ఐటీ మౌలిక వ్యవస్థలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, బ్యాంక్ వృద్ధి రేటుకు అనుగుణంగా నియంత్రణలు లేకపోవడంతో ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది. గత రెండేళ్లుగా (2022, 2023) తాము జరిపిన పరిశీలనలో ఈ విషయం తేలినట్టు తెలిపింది. ఈ నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించింది.

అయితే ఈ నిషేధం బ్యాంక్ ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం చూపదని తెలిపింది. బ్యాంకు వారికి యథావిధిగా తన సేవలు అందించవచ్చని స్పష్టం చేసింది. కాగా 2020 డిసెంబరులో ఇదే తరహా కారణాలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా, కొత్త డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురాకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. అనంతరం నిబంధనలకు అనుగుణంగా బ్యాంక్ చర్యలు తీసుకోవటంతో 2022 మార్చిలో ఆర్‌బీఐ ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.

బ్యాంకుపై ప్రభావం

ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం లేకపోయినా.. ఆన్‌లైన్ లేదా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కోటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోవడంపై ఆర్‌బీఐ నిషేధం తీవ్ర ప్రభావం చూపనుంది. కొత్త క్రెడిట్ కార్డుల జారీనీ ఆర్‌బీఐ నిషేధించడంతో ఆ ప్రభావమూ బ్యాంక్‌పై తీవ్రంగానే ఉంటుందని నిపుణుల అంచనా. వ్యాపార విస్తరణలో భాగంగా బ్యాంక్ ఇటీవల ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానల్స్ ద్వారా పెద్దఎత్తున కొత్త ఖాతాదారులను చేర్చుకుంటోంది. క్రెడిట్ కార్డుల మార్కెట్లోనూ బ్యాంక్ ఇటీవల ఎస్‌బీఐ కార్డ్స్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రధాన బ్యాంకులతో పోటీపడుతోంది. ఆర్‌బీఐ తాజా నిషేధంతో ఈ ప్రయత్నాలకు బ్రేక్ పడనుంది.

దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం

మరోవైపు బ్యాంక్ ఐటీ సిస్టమ్స్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన కొత్త టెక్నాలజీలను తీసుకువచ్చేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నట్టు కోటక్ మహీంద్రా బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్‌బీఐతో కలిసి పనిచేయనున్నట్టు తెలిపింది.

లోపాలు ఇవే..

కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఐటీ రిస్క్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నెన్స్ విధానాలు తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని ఆర్‌బీఐ తెలిపింది. దీంతో బ్యాంక్ ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, ప్యాచ్ అండ్ చేంజ్ నిర్వహణ, యూజర్ యాక్సెస్ నిర్వహణ, వెండర్ రిస్క్ నిర్వహణ, డేటా సెక్యూరిటీ, డేటా లీక్ ప్రివెన్షన్ స్ట్రాటజీ, బిజినెస్ కంటిన్యుటీ, డిజాస్టర్ రికవరీ విధానాలు కూడా లోపభూయిష్ఠంగా ఉన్నట్టు తమ పరిశీలనలో తేలినట్టు ప్రకటించింది. ఈ లోపాల కట్టడి కోసం బ్యాంక్ తీసుకున్న చర్యలు కూడా లోపభూయిష్ఠంగా ఉండడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చినట్టు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగానే కోటక్ మహీంద్రా బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ (సీబీఎస్), ఆన్‌లైన్, డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ గత రెండేళ్లుగా తరచూ సమస్యలకు లోనవుతున్నట్టు తెలిపింది. ఈ నెల 15న బ్యాంక్ సేవల అంతరాయానికీ ఇదే కారణమని పేర్కొంది. బ్యాంక్ తమకు సంతృప్తి కలిగించేలా ఈ లోపాలను సరిదిద్దుకున్న వెంటనే ఈ నిషేధం ఎత్తివేస్తామని తెలిపింది.

ఫార్మా ఎగుమతులు..
రూ.2.32 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24) భారత్ నుంచి 2,790 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.32 లక్షల కోట్లు) విలువైన ఔషధాలు, ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది 9.67 శాతం ఎక్కువ. గత ఆర్థిక సంవత్సరం మన మొత్తం ఎగుమతులు 3 శాతం పడిపోయినా ఫార్మా ఎగుమతులు 9.67 శాతం పెరగడం విశేషం. ఈ ఏడాది మార్చిలో అయితే ఫార్మా ఎగుమతులు 12.73 శాతం పెరిగి 280 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం మన ఫార్మా ఎగుమతుల్లో ఎక్కువ భాగం అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతయ్యాయి. మన మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 31 శాతం అమెరికానే దిగుమతి చేసుకుంది. భారత ఫార్మా కంపెనీలు 60 రకాల అనారోగ్య సమస్యల చికిత్సకు అవసరమైన 60,000 రకాల జెనరిక్ ఔషధాలు ఉత్పత్తి చేస్తూ విదేశీ మార్కెట్లలోనూ తమ సత్తా చాటుతున్నాయి.

హైదరాబాద్‌లో మూడో డేటా సెంటర్: కంట్రోల్‌ఎస్

హైదరాబాద్: డేటా సెంటర్స్ సంస్థ కంట్రోల్‌ఎస్ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మరో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. భూకంపాలను తట్టుకునేలా 1.34 లక్షల ఎస్ఎఫ్‌టీలో కంపెనీ ఐదు అంతస్తులతో ఈ డేటా సెంటర్ భవనాన్ని నిర్మిస్తోంది. 2-3 నెలల్లో ఈ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపింది. సీస్మిక్ జోన్-2లో ఉండడంతో హైదరాబాద్ డిజాస్టర్ రికవరీ సేవల కంపెనీలకు ప్రధాన కేంద్రంగా మారుతోందని కంట్రోల్‌ఎస్ పేర్కొంది.

బిజినెస్

ఐటీ ఉద్యోగులే రిటైల్ రంగానికి చోదక శక్తి

- ఆర్ఏఐ సీఈఓ రాజగోపాలన్

హైదరాబాద్‌లో రిటైల్ రంగ అభివృద్ధికి ఐటీ ఉద్యోగులు ప్రధాన చోదక శక్తిగా మారారని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) సీఈఓ కుమార్ రాజగోపాలన్ అన్నారు. ఆర్ఏఐ నిర్వహించిన హైదరాబాద్ రిటైల్ సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోయిందన్నారు. ప్రస్తుతం ఖాతాదారులు 24 గంటల ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో పాటు విశ్వసనీయమైన ఆఫ్‌లైన్ అనుభూతిని ఆశిస్తున్నట్టు రాజగోపాలన్ తెలిపారు. రిటైల్ కంపెనీలు కొత్త విషయాలు నేర్చుకోవడంపై ఆసక్తి చూపకపోతే రిటైల్ పరిశ్రమ వృద్ధి రేటుకు గండిపడుతుందని సదస్సుకు ప్రధాన అతిథిగా హాజరైన తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. హైదరాబాద్ మంచి నివాసయోగ్యమైన నగరంగా మారడానికి రిటైల్ సంస్థలూ ఒక కారణమన్నారు.

ఉద్యోగులు అందరికీ ఈసాప్స్

క్రిటికల్‌రివర్

హైదరాబాద్: తమ సంస్థలో పని చేస్తున్న 1,000 మంది ఉద్యోగులు అందరికీ ఈసాప్స్ (ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్) కింద కంపెనీ షేర్లు కేటాయించినట్టు టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ ఇంక్ ప్రకటించింది. దీనికి తోడు ఉద్యోగుల సర్వీసు ఆధారంగా ప్రతి ఏడాది సర్వీసుకు 100 షేర్ల చొప్పున కేటాయిస్తామని తెలిపింది. దీనివల్ల ఉద్యోగుల్లోనూ కంపెనీ మనది అనే భావన ఏర్పడుతుందని పేర్కొంది. ప్రపంచంలోని తొమ్మిది ప్రాంతాల్లో తమ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులు అందరికీ ఈ ఈసాప్స్ లభిస్తాయని తెలిపింది.

యాక్సిస్ బ్యాంక్ లాభం
రూ. 7,129 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ రూ.7129.67 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.5,728.42 కోట్ల నష్టం నమోదు చేసింది. బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.28,758 కోట్ల నుంచి రూ.35,990 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1 డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

హెచ్‌యూఎల్ లాభం డౌన్

ముంబై: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) కన్సాలిడేటెడ్ నికరలాభం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో 1.53% క్షీణించి రూ.2,561 కోట్లకు దిగజారింది. త్రైమాసికంలో కంపెనీ నికర అమ్మకాలు రూ.15,013 కోట్లు ఉంది. బుధవారం జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.24 తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

ఇన్వెస్టర్ల సంపద
రూ.8.5 లక్షల కోట్లు అప్

మార్కెట్లో నాలుగో రోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ బుధవారం వరుసగా నాలుగో రోజున కూడా లాభాలతో ముగిసింది. మెటల్, కమోడిటీ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగినప్పటికీ టెలికాం, ఐటీ, టెక్ కౌంటర్లలో చివరి గంటలో సాగిన అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలకు కళ్లెం వేసింది. ఫలితంగా ఇంట్రాడేలో 383.16 పాయింట్ల లాభంతో 74,852.94 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి లాభాలను 114.49 పాయింట్లకే పరిమితం చేసుకుని 73,852.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 34.40 పాయింట్ల లాభంతో 22,402.40 వద్ద క్లోజైంది. ఈ నాలుగు రోజుల ర్యాలీలో సెన్సెక్స్ 1,363.95 పాయింట్లు పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.8,48,328.90 కోట్లు పెరిగి రూ.4,01,37,377.21 కోట్లకు చేరింది.

తగ్గిన ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం

ముంబై: ఐటీ రంగంలోని ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసిక లాభంలో 1.2 శాతం క్షీణతను నమోదు చేసింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం రూ.1,114.1 కోట్ల నుంచి రూ.1,100.7 కోట్లకు తగ్గింది. ఆదాయం మాత్రం 2.32 శాతం వృద్ధితో రూ.8,691 కోట్ల నుంచి రూ.8,892.9 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ.35,537 కోట్లు కాగా లాభం రూ.4,584.6 కోట్లుగా నమోదైంది.

ఎల్‌ఐసీ పేరుతో నకిలీ ప్రకటనలు... తస్మాత్ జాగ్రత్త

న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) పేరు, లోగోలను, కొందరు సీనియర్ అధికారుల పేర్లను అనధికారికంగా ఉపయోగించుకుంటూ మోసపూరిత శక్తులు సామాజిక మాధ్యమ వేదికగా జారీ చేస్తున్న నకిలీ ప్రకటనలకు మోసపోవద్దని పాలసీదారులు, ప్రజలను ఎల్‌ఐసీ హెచ్చరించింది. ఎక్స్ వేదికగా ఎల్‌ఐసీ ఈ హెచ్చరిక చేస్తూ అలాంటి ప్రకటనలు వెలువడినప్పుడు అవి అధికారికమైనవేనా అని ధ్రువీకరించుకోవాలని సూచించింది. "కొందరు వ్యక్తులు/కొన్ని సంస్థలు ఎల్‌ఐసీ అధికారులు, మాజీ అధికారుల పేర్లను, సంస్థ బ్రాండ్ లోగోను, పేరును ఉపయోగించుకుని మోసపూరిత ప్రకటనలు సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. అలాంటి మోసపూరిత ప్రకటనల బారిన పడవద్దని ఈ వేదిక ద్వారా మా కస్టమర్లను హెచ్చరిస్తున్నాం" అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అలాంటి మోసపూరిత వ్యక్తులు, సంస్థలు ఇచ్చే యుఆర్ఎల్‌పై క్లిక్ చేసి వారి వలలో పడవద్దని తెలిపింది.

ఏపీ, తెలంగాణ రైతులకు బేయర్ సేవలు

న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు బేయర్ క్రాప్ సైన్సెస్ ముందుకొచ్చింది. ఇందుకోసం కామన్ సర్వీసెస్ సెంటర్, గ్రామ ఉన్నతి అనే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా చిన్నసన్నకారు రైతులకు పంటల సంరక్షణకు అవసరమైన సలహాలతో పాటు తన అధునాతన ఉత్పత్తులను అందిస్తుంది. అలాగే రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడంలో సాయపడుతుంది.

మే 31లోగా ఎలాంటి అదనపు భారం ఉండదు

సీబీడీటీ

న్యూఢిల్లీ: అసెసీలు మే 31 లోగా పాన్-ఆధార్ అనుసంధానత పొందే పక్షంలో వారిపై ఎలాంటి అదనపు పన్ను భారం ఉండదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ఎవరైనా పాన్, ఆధార్ అనుసంధానం చేసుకోకపోయినట్టయితే వారికి వర్తించే పన్ను రేటుపై రెండింతలు పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ అంశంపై పన్ను చెల్లింపుదారుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించిన అనంతరం మార్చి 31లోగా పాన్, ఆధార్ అనుసంధానానికి దరఖాస్తు చేసుకుని ఉండి మే 31లోగా వారికి అనుమతి లభించే పక్షంలోవారిపై ఎలాంటి అదనపు పన్ను భారం వేయవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సీబీడీటీ తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	86,400 ▼
ముంబై	71,826 ▲	65,793 ▲	80,687 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	453	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	126
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	120
కర్నూలు	120	నెల్లూరు	120
విశాఖపట్నం	118	అనంతపురం	126
గోదావరి	126		



నామినేషన్ అందజేస్తున్న నరేంద్ర, రావి వెంకటరమణ తదితరులు

- పసుపుమయంగా పొన్నూరు
- బైక్ ర్యాలీతో కదం తొక్కిన యువత
- అట్టహాసంగా ధూళిపాళ్ల నామినేషన్ దాఖలు

నరేంద్రకు నీరాజనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 24: బారులు తీరిన ప్రజాభిమానం.. జనం జయజయ ధ్వానాల మధ్య బుధవారం కూటమి తరపున పొన్నూరు టీడీపీ అభ్యర్థిగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జన నీరాజనాల మధ్య నామినేషన్ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు ర్యాలీలో రెపరెపలాడాయి. దారిపొడవునా మహిళలు బారులు తీరి నరేంద్రకు పూలతో స్వాగతం పలికారు. యువకులు బైకులతో తరలివచ్చి ర్యాలీలో కదంతొక్కింది. నేతాజీనగర్, ఐల్యాండ్ సెంటర్, తెలగపాలెం రామమందిరం, వీవర్స్‌కాలనీ వద్ద అభిమానులు క్రేన్ సాయంతో భారీ గజమాలలతో నరేంద్రను సత్కరించారు. మూడు మండలాల నుంచి భారీ సంఖ్యలో కూటమి శ్రేణులు తరలిరావటంతో పొన్నూరు కిటకిటలాడింది. పట్టణం పసుపుమయంగా మారింది. భారీగా తరలివచ్చిన వారికి దారిపొడవునా మంచి నీరు, మజ్జిగ సరఫరా చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నా ఊహించిన దానికన్నా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నేతలు సంబరపడ్డారు. చింతలపూడి దాటడానికే గంటకు పైగా సమయం పట్టింది.

ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు

నరేంద్రకుమార్ మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరులోని ఇష్టదైవం నాగారుపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఇంటి వద్ద తల్లి ప్రమీలాదేవి ఆశీస్సులు అందుకుని, పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం నరేంద్ర, జ్యోతిర్మయి దంపతులు, లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవిశంకర్, జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, పార్టీ పరిశీలకుడు మన్నవ సుబ్బారావు వెంటరాగా నామినేషన్ దాఖలుకి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై బయలుదేరారు. ఉదయం నుంచే పొన్నూరుతో పాటు చింతలపూడి వీధుల్లో కోలాహల వాతావరణం నెలకొంది. చింతలపూడిలోని శ్రీమొగదారమ్మ గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు, గంజె షాహిద్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం, చద్దర్ సమర్పించారు. తెలగపాలెం రామ మందిరంలో పూజల అనంతరం అక్కడే నామినేషన్ పత్రాలపై నరేంద్రకుమార్ సంతకాలు చేశారు. తోటమ్మ తల్లి ఆలయంలో,గాంధీ బొమ్మ సెంటర్ భవనారాయణ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ర్యాలీ పొడవునా సంప్రదాయ డప్పు వాయిద్య కళాకారులు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జై తెలుగుదేశం, జై జనసేన నినాదాలతో వీధులు హోరెత్తాయి. పాతపొన్నూరుకు చెందిన టీడీపీ అభిమానులు పందెపు ఎడ్లతో బండి కట్టి తీసుకురాగా నరేంద్రకుమార్ తదితరులు దానిపై ఎక్కారు. తెలగపాలెం రామ మందిరం మీదగా, ఆర్టీసీ డిపో సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. మార్గమధ్యలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



యడ్లబండిపై నామినేషన్‌కు వెళుతున్న నరేంద్ర



నరేంద్ర నామినేషన్‌కు తరలివచ్చిన టీడీపీ,జనసేన, బీజేపీ శ్రేణులు



ర్యాలీలో మనోహర్, ఆలపాటి అభిమానులకు అభివాదం

తెనాలిలో ప్రభంజనం

- అట్టహాసంగా మనోహర్ నామినేషన్
- వేలాదిగా తరలివచ్చిన శ్రేణులతో నాదెండ్ల ర్యాలీ

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: మండే ఎండ.. అభిమాన సందోహం.. అడగడుగునా హారతులు.. గజమాలలతో సత్కారం మధ్య కూటమి తరఫున తెనాలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల సంబరాల మధ్య తెనాలిలో మనోహర్ నామినేషన్ ర్యాలీ జరిగింది. మహిళల మంగళ హారతులు, జనసైనికుల సమరోత్సాహం, డప్పు వాయిద్యాలు, తీన్మార్ సందడి, బాణసంచా మోతలు, కార్యకర్తల కేరింతల మధ్య పండుగ వాతావరణంలో నాదెండ్ల నామినేషన్‌కు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనసైనికులు, టీడీపీ, బీజేపీ శ్రేణులతో తెనాలి జనసంద్రాన్ని తలపించింది. తొలుత ఐతానగర్‌లోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జనసేన, బీజేపీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, పాటిబండ్ల రామకృష్ణ తదితరులతో కలిసి ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ మనోహర్ నామినేషన్ వేసేందుకు ర్యాలీగా బయల్దేరారు. దారి పొడవునా ఉమ్మడి పార్టీల శ్రేణులు మనోహర్‌ను భారీ గజమాలలతో సత్కరిస్తూ స్వాగతం పలికారు. రజకచెరువు, గాంధీచౌక్, శివాజీచౌక్ మీదగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ఎన్నికల అధికారి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.



నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న మనోహర్, రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు తదితరులు

కూటమిపై తప్పుడు ప్రచారాలు

- ఓటమి భయంలో విషం చిమ్ముతున్న జగన్
- రచ్చబండ కార్యక్రమంలో మంగళగిరి అభ్యర్థి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 24: ఓటమి భయంతో జగన్ కూటమి పార్టీలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నది. టీడీపీపై విషం చిమ్ముత్తున్నారు. జగన్, ఆయన గ్యాంగ్ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. న్యాయాన్ని గెలిపించుకోవాలి... అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చినకాకాని, ఎర్రబాలెం, సీతానగరం ప్రాంతాల్లో జరిగిన రచ్చబండ కార్యక్రమాల్లో లోకేశ్ ప్రసంగించారు. వైసీపీ సర్వేలోనే కూటమి ప్రభంజనం ఖాయమన్న సంకేతాలతో జగన్ అండ్ కో విషప్రచారాలనే ఆయుధాలుగా మలుచుకుంటుందన్నారు. జగన్ మాయలో పడి కొందరు కాపు నేతలు సైతం ఏవేవో మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ నేతలు నాడు రిజర్వేషన్ల విషయంలో జగన్ చేసిన దుర్మార్గాన్ని ఎందుకు ప్రశ్నించలేక పోతున్నారని ప్రశ్నించారు.. నిజానికి కాపులకు తమ ప్రభుత్వం చేసిన దాంట్లో వైసీపీ ప్రభుత్వం పది శాతమైనా చేసిందో లేదో పరిశీలించుకోవాలన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే తాము బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వస్తే క్రైస్తవులను, ముస్లింలను ఇబ్బందులు పెడతామంటూ వైసీపీ చేస్తోన్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. 2014లో తాము బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని నడిపినపుడు క్రైస్తవులకు, ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. క్రిస్మస్ కానుకలు, రంజాన్ తోఫా అందించిన ఘనత తమ టీడీపీ ప్రభుత్వానిదన్న సంగతి మరువరాదన్నారు. రేపల్లెలో అమర్‌నాథ్‌గౌడ్‌ను పెట్రోలు పోసి హత్య చేసిన దారుణ ఘటన చూశాక బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.



వైసీపీ నేతలను నిలదీయాలి..

ఎర్రబాలెంలో జరిగిన రచ్చబండలో మాట్లాడుతూ రాజధాని రైతులు వైసీపీ నేతలను నిలదీయాలని లోకేశ్ పిలుపిచ్చారు. అమరావతి కోసం ఉద్యమిస్తున్న మహిళలను బూటుకాళ్లలో తొక్కించి, అక్రమ కేసులను బనాయించారన్నారు. అమరావతి ప్రాంతంలో ప్రజల సొమ్ముతో నిర్మించిన రోడ్లను తవ్వేసి ఇసుక, గ్రావెల్‌ను దోచుకెళ్లారన్నారు. రాజధాని రైతులు, పేదలు, కూలీల సమస్యలను తాము అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామన్నారు. రాజధాని ఇక్కడే వుంటుందని నమ్మించిన ఆళ్ల ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. ఏ మొఖం పెట్టుకుని ఇపుడు రాజధాని రైతులను ఓట్లడుగుతారని ప్రశ్నించారు. అంతకుముందు లోకేశ్‌కు చినకాకాని, ఎర్రబాలేనికి చెందిన వారు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. చినకాకాని సెయింట్ జోసఫ్ చర్చిని లోకేశ్ సందర్శించగా ఫాదర్ జోజయ్య ఆశీర్వదించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ, జనసేన నేతలు ఆకుల జయసత్య, ఆకుల ఉమామహేశ్వరరావు, తోట పార్థసారథి, చావలి ఉల్లయ్య, గాదె పిచ్చిరెడ్డి, జాన్సన్, యలమంచిలి పద్మజ, మంచికలపూడి వైష్ణవి, మునగపాటి వెంకటమారుతీరావు, వాసా శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబాలెం రచ్చబండకు హాజరైన జనం

కిలాడి.. మేత

- ఉద్యోగుల ఇళ్ల స్థలాలు కాజేసిన పొన్నూరు వైసీపీ నేత
- అప్పనంగా ఆరు ప్లాట్లు.. రూ.3 కోట్లు ముడుపులు
- ముఖ్యనేత అండతో రెచ్చిపోయిన ఎన్జీవో నేతలు
- సంఘంతో సంబంధం లేని వారికి రిజిస్ట్రేషన్‌లు
- పూజారులు, అధికార పార్టీ నాయకులు, వ్యాపారులకు ప్లాట్లు



ఇదీ సంగతి..

పొన్నూరు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే లక్ష్యంతో 2004లో ఒక ఎన్జీవో సొసైటీని ఏర్పాటు చేశారు. సాక్షి భవన్నారాయన స్వామి దేవస్థానంకు చెందిన 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నెంబర్ 221-1 లోని ఈ భూమిని ఎకరం రూ.4 లక్షలు చొప్పున అప్పటి ఉద్యోగుల నుంచి సేకరించిన సొమ్ముతో కొనుగోలు చేశారు. 3 సెంట్లు చొప్పున 98, 4 సెంట్లు చొప్పున 146 ప్లాట్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ విషయంలో వివాదం తలెత్తడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. అప్పట్లో వున్న చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ పొందగా, కొందరు మరణించారు. కొద్దిరోజుల క్రితం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం కావటంతో ఎన్జీవో నేతలు పొన్నూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని సంప్రదించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సహకరించాలని కోరారు.

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరులోని ఆ వైసీపీ నేత కన్ను పడితే అంతే. ముడుపులు అయితే ఇంటికి వెళ్ళాలి. స్థలాలు.. పొలాలు అయితే ఆయన బినామీల పేరుతో మారాలి. గడచిన ఐదేళ్ల కాలంలో ఎంత తిన్నా ఆకలి తీరని ఆయన చివరకు చిన్నా చితక ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు ఎసరు పెట్టేసారు. ఎన్జీవో(నాన్ గజిటెడ్ అసోసియేషన్)లకు చెందిన ఇళ్ల స్థలాలను తన బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా రూ.6 కోట్లు ఖర్చుల రూపేనా వసూలు చేయించి అందులో రూ. కోట్లు ముడుపులు కింద కొట్టేశారు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడున్న ఎన్జీవో నేతలు రెచ్చిపోయారు. ఒక్కొక్కటి రూ.40 లక్షలు విలువ చేసే ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల ప్లాట్లను టోకున అమ్మేశారు. పూజారులు, వ్యాపారులు, వైసీపీ నాయకులను ఉద్యోగుల కింద చేర్చేసి రిజిస్ట్రేషన్‌లు చేశారు. పొన్నూరు వైసీపీ ముఖ్య మేత, ఎన్జీవో నేతలు ఆడిన ఆ ప్లాట్లాటలో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరిగింది. ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఇక్కడ జరిగిన అక్రమాలపై కేస్ ఫైల్ అయ్యింది.

అన్నీ అక్రమాలే..

నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడి ఎన్జీవో నేతలు తోటి ఉద్యోగుల ప్రయోజనాలను తుంగలో తొక్కేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. అందుకోసం అనేక అడ్డ దారులు తొక్కేశారు. ఒక్కొక్క ప్లాట్ రిజిస్ట్రేషన్ కు ఉద్యోగుల వద్దనుంచి ఖర్చులు కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు వసూలు చేశారు. ప్రస్తుతం అక్కడ మంచి ధర ఉండటంతో ఒక్కొక్క ప్లాట్ రూ.40 లక్షల వరకు పలుకుతుంది. దాన్ని సాకుగా చూపించి ప్రతి ఉద్యోగి వద్ద నుండి వీలైనంత ఎక్కువ గుంజేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ప్లాట్లు కట్టబెట్టారు. అందుకోసం రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భూమి కొనుగోలుకు నగదు చెల్లించి మధ్యలో మరణించిన వారి ప్లాట్లను వారి పిల్లలకు ఇవ్వకుండా బయట అమ్మేసినట్లు తెలుస్తోంది.

తిలా పాపం.. తలా పిడికెడు

మొత్తం మీద పొన్నూరు ఎన్జీవో ప్లాట్లలో భారీగానే వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారిక లెక్కలు ప్రకారం సుమారు రూ.6 కోట్ల వరకు చేతులు మారినట్లు చెబుతున్నారు. అందులో రూ.3 కోట్లు ముఖ్య నేతకు వెళ్లగా, మిగిలిన సొమ్ము ఎన్జీవో నాయకులు వాటాలు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుంటూరులోని ఒక కార్యాలయంలో కొందరు నాయకులు డబ్బులు పంచుకునే విధానాన్ని బాధితుడు వీడియో తీసి మీడియాకు అందించారు. ఈ అక్రమాలపై అక్కడి ముఖ్య నేతలు ఇప్పటికే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఉద్యోగ సంఘ నాయకులపై కూడా ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది.

భారీగా స్టాంప్ డ్యూటీ ఎగవేత?

ఎన్జీవో సంఘం పేరిట పొన్నూరులో జరిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భారీగా స్టాంపు డ్యూటీ ఎగవేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ముఖ్యనేత ఒత్తిడి కి తలొగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నామమాత్రపు స్టాంపు డ్యూటీతో ప్లాట్లను బదలాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి స్టాంపు డ్యూటీ మినహాయింపు పొందాలంటే ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వాలి. అటువంటిది ఇక్కడ ఏమి జరగలేదని అంటున్నారు. ఒక వేళ అటువంటి వెసులు బాటు వున్నా అది కేవలం ఎన్జీవో జాబితాలో ముందు నుంచి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ ఇష్టం వచ్చినట్లుగా, జాబితాతో పనిలేకుండా ప్రక్రియ జరిగి నందువల్ల స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడినట్లు సమాచారం.

పక్కా సెటిల్‌మెంట్

ఎన్జీవో సంఘ నేతలు సంప్రదింపుతో అప్రమత్తం అయిన నియోజకవర్గ మేత కొన్ని ప్లాట్లు తనకు రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. కనీసం 10 ప్లాట్లు అయినా తనకు కావాలని పట్టుపట్టారు. చివరకు 6 ప్లాట్లు, వసూలు చేసిన సొమ్ములో సగం ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తెరలేపారు.

అసలు ఉద్యోగులే కాదు

పొన్నూరు ఎన్జీవో నేతలు అంతులేని అక్రమాలకు తెరలేపారు. అసలు ఉద్యోగులు కానివారికి ప్లాట్లు రిజిస్టర్ చేశారు. ఉదాహరణకు.. పోతన వెంకట్రావు పేరుతో ప్లాట్ నెంబర్: 21ని డాక్యుమెంట్ 4705/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. అతను ఎన్జీవో సంఘానికి చెందిన వారు కాదని తెలుస్తోంది. ప్లాట్ నెంబర్:211ను వి.సత్యనారాయణకు డాక్యుమెంట్ 4775/ 2023 ద్వారా రిజిస్టర్ చేశారు. ఆయన కూడా ఎన్జీవో కాదని తెలుస్తుంది. జాబితాలో మరొకరి పేరు ఉండగా, ఈయన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం గమనారం. ఇప్పటి వరకు మొత్తం 200 ప్లాట్లు వివిధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ కాగా, అందులో అధిక భాగం ఇతరుల ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌అండ్‌బీలో పనిచేసే ఉద్యోగుల పేరిట కొన్ని ప్లాట్లు రిజిస్టర్ కాగా అదే రోజున వాటిని వేరే వారి పేరు మీదకు మార్చేశారు. నియోజకవర్గ నేత బినామీలకు అదే పద్ధతిలో రిజిస్ట్రేషన్ జరిగింది.

లోపలి పేజీల్లో..

అభివృద్ధిని విస్మరించి.. అప్పులు మిగిల్చి..
- ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే !
- 1590వ రోజుకు రైతులు ఆందోళనలు

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

పిటిషనర్లకు రక్షణ కల్పించండి
- పల్నాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

మనోహర్‌కు వైసీపీ కౌన్సిలర్ మద్దతు



నారా లోకేశ్‌కు రూ.15 లక్షల డీడీని అందజేసిన ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం సభ్యులు

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం

రూ.15 లక్షలు విరాళం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24: అమెరికాలోని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం రూ.15లక్షలు విరాళం అందజేసింది. యుఎస్‌ఏ ఫ్లోరిడాలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ విభాగం సభ్యులు కనుమూరి ఈశ్వర్, పోట్లూరి మహేష్, స్నేహితులు ఈ విరాళాన్ని అందజేశారు. పల్నాడుజిల్లా నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఉంటున్న వారి బంధువుల ద్వారా ఈ విరాళాన్ని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి రూ.15 లక్షల డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కనుమూరి ఆంజనేయులు, జాష్టి బాబు, ఈదర శ్రీనివాసరావు, సూరే రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీతో

రోబోకప్లర్ అవగాహన ఒప్పందం

గుంటూరు(విద్య), ఏప్రిల్24: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో వైజాగ్‌లోని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లాతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగభూషణ్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలోని బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు భారతదేశపు ప్రీమియర్ ఆండ్రో హ్యూమనాయిడ్ రోబోటిక్ కంపెనీ రోబోకప్లర్‌తో సంచలనాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లివ్వండయ్యా !

- మంచినీటి కోసం మహిళల ఇబ్బందులు

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఏప్రిల్ 24: భూగర్భ జలాలు అడుగంటడంతో చేతిపంపులు, విద్యుత్ మోటర్లు పనిచేయక పోవడంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బంది పడుతున్నారు. దాచేపల్లి మండలంలో వాగులు, వంకలు, చెరువులు, పల్నాడు జీవనదిగా ప్రసిద్ధిగాంచిన నాగులేరు ఎండిపోయాయి. మార్చినుంచే ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. దాచేపల్లి నగర పంచాయతీలోని ఐదు గ్రామాలు, రూరల్‌లోని 12 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి.

తాగునీటిలో కూడా రాజకీయాలు...

నీరందించే విషయంలో కూడా రాజకీయాలు చేస్తున్నారని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తుంది. మున్సిపల్ చైర్మన్‌గా వైసీపీ నేత కొనసాగడంతో మున్సిపాల్టీ నుండివచ్చే వాటర్ ట్యాంకర్లు వైసీపీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు అధికంగావున్న వీధుల్లోనే చక్కర్లు కొడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. తాగే నీటి విషయంలోనూ రాజకీయాలా? వైసీపీ వాళ్లే ప్రజలా? టీడీపీ కార్యకర్తలు ప్రజలు కాదా? అంటూ మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. తాగునీటి సమస్యపై పార్టీల రహితంగా అందరికీ నీరందించాలని టీడీపీ నాయకులు మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిం చారు. కమిషనర్ నిబంధనల ప్రకారం తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు కానీ అమలులో మాత్రం ఆచరణకు దూరంగా వుందని విమర్శలు వస్తున్నాయి. ప్రైవేటుగా వెయ్యి లీటర్ల ట్యాంకర్ కావాలంటే రూ.600 వసూలు చేస్తున్నారు. ఇప్పుడే ఇలా వుంటే మే నెలలో రానున్న రోహిణికార్తెలో నీటికష్టాలు అధికంగా వుంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పిడుగురాళ్లలో వీధి కులాయిల వద్ద డబ్బాలో నీటిని నింపుకుంటున్న దృశ్యం



పునాదికే పరిమితమైన పిడుగురాళ్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం

రెండేళ్లు అయినా గుక్కెడు మంచినీరు ఏదీ..

పిడుగురాళ్ల పట్టణంలో ఇంటింటికి తాగునీరు అందిస్తామని వైసీపీ నేతల ఆర్భాటపు ప్రకటనలే తప్ప గుక్కెడు నీళ్ల అందిస్తున్న పాపాన పోవడం లేదు. రెండేళ్ల క్రితం పిడుగురాళ్లలో మూడు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా నిధుల కొరతతో అవి పునాదులకే పరిమితమయ్యాయి. పట్టణంలో సుమారు 15,500కు పైగా నివాస గృహాలు వుండగా, గత ఏడాదిన్నరగా ఇంటింటికి తాగునీరు అందించే పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాది లోపే ఇంటింటికి నీళ్లిస్తామన్న పాలకుల మాటలు జనం నమ్మడం లేదు.

రెండేళ్లు అయినా పునాదులకే పరిమితమైన వాటర్ ట్యాంక్ పనులు, నత్తనడకన కొనసాగుతున్న ట్యాప్ కనెక్షన్‌ల పనులు మరో ఏడాదికి పైగా పట్టే అవకాశం వుంది. ఈ వేసవిలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఏరియా, బెల్లంకొండ డొంక, డ్రైవర్స్ కాలనీ, సంజీవరెడ్డినగర్, రసూల్‌పేట, వాసవినగర్‌తో పాటు శివారు ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి రావడంతో మున్సిపల్ అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీళ్లు ఏ మూలకు సరిపోవడం లేదు. టీడీపీ నేతలు దాతలుగా మారి స్వచ్ఛందంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.



దాచేపల్లిలో నీళ్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న దృశ్యం

వైసీపీ నేతల చేతివాటం

- పంచాయతీ స్థలానికి బేరసారాలు

కారంపూడి, ఏప్రిల్ 24: వైసీపీ నేతల చేతివాటంతో పంచాయతీ స్థలం కబ్జాకు గురవుతోంది. వివరాల్లోకి వేళ్తే... స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లే ముందుభాగాన్ని ఓ వ్యాపారి గ్యాస్ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. వైసీపీ నేత అండదండలతో పంచాయతీకి రూ.500 అద్దె కడుతున్నట్లు వ్యాపారి తన పేరుపై రశీదు పొందుతున్నాడు. ఆరు నెలల క్రితం ఆ షాపులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆషాపును తొలగించాలని గ్రంథాలయ రీడర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు, సరిహద్దు వ్యాపారులు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యాపారి ఈ షాపును వేరే వ్యాపారి జ్యూస్ షాపునకు రూ.3500కు అద్దెకిచ్చాడు. అంతటితో ఆగక తనకు రూ.లక్షన్నర కావాలంటూ వైసీపీ బడా నేతల ద్వారా డిమాండ్ చేశాడు. కాగా ఇందులో మరో వైసీపీ ముఖ్య నేత కల్పించుకొని పంచాయతీలో రూ.500 అద్దెకట్టేలా జ్యూస్ వ్యాపారి పేరుపై రాయించాడు. వైసీపీ వర్గపోరుతో ఈ విషయం బయటకొచ్చింది. దేనికైనా సిద్ధమంటూ ఇరువురు వైసీపీ నేతలు హెచ్చరికలు కూడా చేసుకున్నారు. గ్యాస్ వెల్డింగ్ వ్యాపారి తనంతట తాను షాపు తొలగించుకుంటున్నాడు. ఈ క్రమంలోనైనా గ్రంథాలయానికి స్త్రీలు కూడా వెళ్లేందుకు మెరుగైన మార్గం కల్పించాలని అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. కాగా జ్యూస్ వ్యాపారి తరఫున నిలిచిన వైసీపీ నేత మాత్రం జ్యూస్ వ్యాపారం నిర్వహించుకునేలా చూసేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కాగా వైసీపీ నేతల చేతివాటం చర్చనీయాంశంగా మారింది.



అక్రమంగా నిర్మించిన గదిని తొలగిస్తున్న వ్యాపారి



కంకటపాలెం గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై ఉన్న వైసీపీ జెండాలు

ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు కట్టారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ కొద్దిరోజులుగా జెండాలు ఎగురుతున్న అధికారులు తొలిగించకపోవటం పట్ల అనేక విమర్శలు వస్తున్నాయి. జెండాలను తొలిగించాలని తెలుగుదేశం నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈవిషయమై ఎంపీడీవో పర్రె విజయశేఖర్ దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే తొలిగిస్తామని గ్రామ కార్యదర్శిపై తగువిధంగా స్పందిస్తామన్నారు.

కోన రఘుపతిపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 24: ప్రభుత్వ అసైన్డ్‌భూమిని ప్రైవేట్‌భూమి అని తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే కోన రఘుపతి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు బుధవారం ఆర్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోన రఘుపతి ఆర్‌వోకు ఇచ్చిన సమాచారంలో ఈవిధంగా వివరాలు తెలియజేశారన్నారు. సదరు భూమి మార్కెట్ విలువను కూడా తప్పుడుగా చూపించారని పేర్కొన్నారు. కావున దీనిపై చట్టప్రకారం విచారణ జరిపి ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు పరిచి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

దాచేపల్లి, ఏప్రిల్24: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న మహిళను వైనుకవైపు నుంచి మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయమై వైద్య చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడులో జరిగింది. గ్రామానికి చెందిన సంకుల యశోదమ్మ(51) భర్త నరసయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు ఈ నెల 22వ తేదీన వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ముందువెళ్తున్న యశోదమ్మ వాహనాన్ని వెనుక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన యశోదమ్మ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలికి ఇరువురు సంతానం వున్నారు. ఈ మేరకు దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రూ.20కి బదులు రూ.20 వేలు చెల్లింపు

- ఆన్‌బోర్డు టీటీఈకి ఫిర్యాదు చేసిన బాధిత ప్రయాణికుడు
- నగదుని వాపస్ చేయించిన రైల్వే అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీ ద్వారా తప్పుగా బదిలీ చేసిన అదనపు నగదుని గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ అధికారులు సంబంధిత వెండార్ నుంచి ప్రయాణీకుడికి తిరిగి ఇప్పించి ప్రశంసలందుకొన్నారు. షేక్ షాబుల్ ఇస్లాం అనే ప్రయాణీకుడు ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి హౌరాకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో వెళుతూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో టెట్రా పాల ప్యాకెట్‌ని కొనుగోలు చేశాడు. అలానే మరి కాసేపటికి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి దానికి రూ.20 బదులు రూ. 20 వేలు నగదు బదిలీ చేశారు. ఈ విషయాన్ని కాసేపటికి ప్రయాణీకుడు తెలుసుకొని ఆన్‌బోర్డు టీటీఈకి సమాచారం ఇచ్చారు. టీటీఈ ఈ విషయాన్ని గుంటూరు కమర్షియల్ కంట్రోలర్‌కు నివేదించగా ఆయన సంబంధిత కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌ని పాల ప్యాకెట్ విక్రయించిన వెండార్ వద్దకు పంపించి యూపీఐ చెల్లింపులను తనిఖీ చేయించారు. అదనపు నగదు వెండార్ బ్యాంకు అకౌంట్‌కు జమ అయినట్లు నిర్ధారించి ఆ మొత్తాన్ని ప్రయాణీకుడు ఇస్లాంకు యూపీఐ ద్వారా చెల్లింపుచేయించారు. ఈ సందర్భంగా కమర్షియల్ అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, డీసీఎం కోఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లు

మే9,10 తేదీల్లో గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు 07025 కాచీగూడ - గుంటూరు రైలు మే 9వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి 11.55కి పిడుగురాళ్ల, అర్ధరాత్రి దాటాక 12.20కి సత్తెనపల్లి, 1.45కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 8గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెంబరు. 07026 కాకినాడ టౌన్ - కాచీగూడ రైలు మే10న సాయంత్రం 5.10కి బయలుదేరి రాత్రి 10.40కి గుంటూరు, 11.23కి సత్తెనపల్లి, 11.55కి పిడుగురాళ్ల, మరుసటి రోజు వేకువ జామున 4.50కి కాచీగూడ చేరుకొంటుంది.



గుంతలో కూరుకుపోయిన బస్సు వెనుకభాగం

తృటిలో తప్పిన ప్రమాదం

కారంపూడి, ఏప్రిల్24: ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు గుంతలో కూరుకుపోయిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల వద్ద బుధవారం జరిగింది. చిలకలూరిపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ (బీహెచ్‌ఎల్)కు బయలుదేరింది. మార్గ మధ్యంలోని ఒప్పిచర్ల వద్ద అకస్మాత్తుగా వెనుకభాగం కొంత గుంతలో కూరుకుపోయింది. వైనుక వైపు టైర్లు ఊడిపోయి పొలాల్లోకి వెళ్లాయి. బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు దిగిపోయారు. పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మనోహర్‌కు వైసీపీ కౌన్సిలర్ మద్దతు

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: అధికార పార్టీ వైసీపీ కౌన్సిలర్ జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు తెలపడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అదే రోజు నామినేషన్ వేస్తుండగా అధికార పార్టీకి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ మానసారెడ్డి దంపతులు నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆయన విజయానికి సహకరిస్తామని చెప్పడం వైసీపీ వర్గాలను షాక్‌కు గురిచేసింది. త్వరలోనే తన అనుచరవర్గాలను కలుపుకుని జనసేన పార్టీలో చేరనున్నట్లు మనోహర్‌కు తెలిపారు. ఇదే బాటలో అధికార పార్టీకి చెందిన మరో నలుగురు కౌన్సిలర్లు వైసీపీని వీడి ఉమ్మడి పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఒక పక్క ఎమ్మెల్యే శివకుమార్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసేందుకు వెళుతుంటే మరో పక్క అదే పార్టీలో కీలకంగా ఉన్న నేతలు పక్క పార్టీలో చేరికల కోసం మంతనాలుజరపడం చర్చనీయాంశంగా మారింది. అయితే రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో అధికార పార్టీని వీడి ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు మద్దతు పలికేలా చేరికలు జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ధూళిపాళ్ళపై 16 క్రిమినల్ కేసులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్24: పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌పై 16 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిడ్‌లో పేర్కొన్నారు. ఈ 16 క్రిమినల్ కేసులు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నమోదైనవి కావటం గమనార్హం. నరేంద్ర కుమార్ పేరుపై చరాస్తులు రూ.2,21,64,554 ఉన్నాయి. స్వగ్రామంలో 4.47 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే స్థిరాస్తుల విలువ రూ.1,66,15,772 విలువగా పేర్కొన్నారు. అలాగే రూ.9.70 లక్షలు రుణం ఉన్నట్లుగా తెలిపారు. షేర్ల రూపంలో రూ.1,44,08,748 ఉన్నట్లు అఫిడవిట్‌లో చెప్పారు. సతీమణి జ్యోతిర్మయి పేరు మీద రూ.1,91,30,851 చరాస్తులు, రూ.6,57,70,000 స్థిరాస్తులు అలాగే రూ.2,74,85,204 అప్పులు ఉన్నట్లు చెప్పారు. షేర్ల రూపంలో రూ.33,97,574 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు.



గుంటూరు జీజీహెచ్‌లో పిల్లల వార్డును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 24: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని పిల్లలవార్డు, కాన్పుల వార్డులను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లో పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఎఫ్‌ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. తల్లి బిడ్డ చేతులకు తగిలించిన ట్యాగ్ పని తీరును ఆయన గమనించారు. పసి బిడ్డలకు ట్యాగ్స్ అమర్చే ప్రక్రియను నర్సింగ్ సిబ్బందే నిర్వహించాలని డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పిటిషనర్లకు రక్షణ కల్పించండి

- పల్నాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఎం.యేసుదానం మరో 49 మంది, అలాగే జంగమేశ్వరపాడుకు చెందిన గుమ్మ పెదరాజయ్య మరో 24మంది హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలపై వైసీపీ నేతలు దాడి చేసి గ్రామాల నుంచి వెళ్లగొట్టారన్నారు. ప్రాణభయంతో పిటిషనర్లు ఇతర గ్రామాలకు వెళ్లి తలదాచుకున్నారన్నారు. సొంతగ్రామాలకు వెళ్లి సాధారణ జీవనం సాగించేందుకు రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ...పిటిషనర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లి సాధారణ జీవితం గడిపేందుకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. వ్యాజ్యాలను పరిష్కరించారు.



టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ జయరాంను సత్కరించిన మురళీకృష్ణ తదితరులు

టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్

కోమటి జయరాంకు సత్కారం

కొల్లూరు, ఏప్రిల్ 24: టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ కోమటి జయరాంను ఆయన టీమ్ సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ సత్కరించారు. బుధవారం కొల్లూరులోని టీడీపీ కార్యాలయానికి ఎన్నారై సెల్ టీమ్ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో మైనేని పలు విషయాలు చర్చించారు. అనంతరం జయరాంతో పాటు ఎన్నారై టీమ్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కోగంటి హరిబాబు, గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, మున్నంగి విజయ్, కాసరనేని మోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం దిగుమతి


ముప్పాళ్ళ ఏప్రిల్ 24: సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు బుధవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా ఆ పార్టీ నేతలు ముప్పాళ్ళ మండలంలోకి భారీగా మద్యాన్ని దిగుమతి చేశారు. మండంలో ప్రతి పోలింగ్ బూత్‌కి 4 నుండి 5 కేసుల మద్యాన్ని ఇప్పటికే గ్రామాలలోకి తరలించారు. కొన్ని గ్రామాలలో ప్రజలను నామినేషన్‌కు సమీకరించేందుకు ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చామని ఆ పార్టీ గ్రామ స్థాయి నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. మండలంలోని ఇరుకుపాలెంకు చెందిన నాయకులు ఆటోలో తెస్తున్న మద్యాన్ని మంగళవారం రాత్రి సత్తెనపల్లి పట్టణంలో ఎన్నికల తనిఖీ బృదం పట్టుకుని 280 క్వాటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ మద్యం అంబటి రాంబాబు నామినేషన్ కార్యక్రమం నిమిత్తం పంపిణీ చేసేందుకు గ్రామాలకు తరలిస్తున్నవేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఇకపైనా గ్రామాలలోకి వస్తున్న ఎన్నికల తాయిలాలను పకడ్బందీగా కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నగదు, వెండి సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 24: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రూ.1,37,000, రూ.1,30,000 నగదు, తెనాలి నియోజకవర్గంలో రూ.2,38,700 విలువ కలిగిన 3,410 గ్రాముల వెండి సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రూ.2,41,26,165 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధిని విస్మరించి.. అప్పులు మిగిల్చి..

- ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే !
- 1590వ రోజుకు రైతులు ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్లూరు, ఏప్రిల్ 24: అమరావతి అభివృద్ధిని పక్కనపెటి రాష్ట్రానికి అప్పులను మిగిల్చిన సీఎం జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగావున్నారని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. రాజధాని ప్రాంత ప్రజల ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1590వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఒక్కో తల మీద జగన్‌రెడ్డి రూ.3 లక్షల అప్పు పెట్టారని ఆరోపించారు. వాటికి వడ్డీలు కట్టేందుకే ప్రజలపై ధరల భారాలను, పిచ్చి పన్నులను మోపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధ్వంసక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి, అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతగా అమలుచేసే నేతను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

72,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 69,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 72,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	14500
273	7500	13500
341	8000	16500
4884	9500	13000
సూపర్ 10	10000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	15000
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	--

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

దోమకాటు వ్యాధులను నివారిద్దాం : డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 24 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రమాదకరమైన దోమకాటు వ్యాధులను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 25న మలేరియా డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు అభివృద్ధి చెందే ప్రమాదం ఉంటుందని ఆమె తెలిపారు. సాయంత్రం వేళల్లో దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు కిటికిలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. రాత్రులు దోమ తెరలు వాడాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ఎండ తీవ్రంగా ఉండే సమయాల్లో ఎక్కువగా బయట తిరగవద్దని ఆమె సూచించారు. కాటన్ దుస్తులు ధరించాలని, ద్రవ పదార్థాలు అధికంగా సేవించాలన్నారు. వడ దెబ్బ బారిన పడ్డ వారికి తగిన చికిత్సలు చేయించాలని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. వడదెబ్బ, డయేరియాపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా శాఖాధికారి సుబ్బరాయనన్, ఏఎంవో రాజు నాయక్, డెమో జయప్రసాద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమం బోధనపై అవగాహన అవసరం

● కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న పోలా భాస్కర్

గుంటూరు(విద్య)ఏప్రిల్ 24: అంతర్జాతీయంగా విద్యా బోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆంగ్ల మాధ్యమంలో అత్యున్నత ప్రమాణాల బోధన ద్వారా విద్యార్థులకు దేశ విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా బోధనలో మార్పులు తీసుకొస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు 'ఎంపవరింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ త్రూ యాక్టివిటీ బేస్డ్ మెథడ్స్, ఓరియంటేషన్ వర్క్ షాప్ ఆన్ యూజింగ్ స్కిల్ కోర్స్ బుక్ ఇంగ్లీష్ ప్రో-1' అంశంపై ఒకరోజు రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో నూతన విద్యా ప్రణాళిక అమలవుతున్న నేపథ్యంలో కళాశాలలో ఆంగ్ల బోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, డాక్టర్ మణికుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ ఫరీదా బేగం, డాక్టర్ మోహన్ వలి, కమిషనరేట్ కార్యాలయం ఎకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఆర్జేడీ డాక్టర్ కళావతి, అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ ఈ.వరప్రసాద్, విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 24 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారు నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు రెండవ రోజున కొనసాగాయి. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఎస్ గోవిందరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కూచిపూడి నృత్య సాంప్రదాయంలో ప్రప్రథమంగా డోలు, నాదస్వరంతో వినూత్న కార్యక్రమాన్ని డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం సూర్యే దర్శకత్వంలో నిర్వహించారు. గాత్రం జే.భువనేశ్వరి, టి.ఎం కృష్ణారావు నాదస్వరం ఎంవీ సుబ్బరామయ్య, క్యాసియో తిన్నలూరి హరిబాబు, డోలుపై హరిబాబు సహకారాన్ని అందించారు. పచ్చల నాగమహిత, తాళ్లూరి ధరణి, బీసాబత్తిని పూజితశ్రీలను యువ కళారత్న పురస్కారంతో సన్మానించారు. పతకమూరి సుప్రియ, గాయత్రి, ఎర్రగుంట హేమ జోషిక చౌదరిల నాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను సంస్థ కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, గరికపాటి శిరీష పర్యవేక్షించారు.

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సభను విజయవంతం చేయాలి

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి

గుంటూరు, ఏప్రిల్ 24: ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు నగర పర్యటనకు వస్తోన్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కార్యక్రమాన్ని కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం శెట్టి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తోన్న వైఎస్ షర్మిల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం సంజీవయ్యనగర్, శారదా కాలనీ, రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో రోడ్‌షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీ సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి మాట్లాడుతూ విభజన హామీలను ప్రశ్నించే ధైర్యం వైసీపీకి లేదన్నారు. నగరంలో జరిగే షర్మిల సభకు పెద్ద ఎత్తున ప్రజలు, ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, యన్నం సుధీర్ బాబు, ఎం.హనుమంతరావు, సీపీఎం నాయకుడు కె.శ్రీనివాసరావు, రత్తయ్య ఉన్నారు.

స్టిక్కర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదాం

● పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంచుతున్న మాధవి, మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుంటూరులో నటన చేసే వలస పక్షులకు స్థానం లేదని, అభివృద్ధి, సంక్షేమం చేసే వారికి మాత్రమే ప్రజలు పట్టంకడతారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు బ్రాడీపేట, స్థంబాలగురువులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నేత వనమా నరేంద్ర, మన్నవ మోహనకృష్ణ హాజరై మాధవితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబును మళ్ళీ రప్పిద్దాం అంటూ మహిళలు నినాదాలు చేసారు. ఈ సందర్భంగా 32వ డివిజన్‌లోని వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి గళ్ళా మాధవి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే పరిపాలన చేయటం చేతకాక ఇంటింటికి స్టిక్కర్లను అంటించి ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి స్టిక్కర్ పీకితే వచ్చే పథకాలను ఆపేస్తారని, ఇళ్ల పట్టాలు, అమ్మఒడిలాంటి పథకాలు నిలిపివేస్తామని ప్రజల్ని భయపెట్టి, బెదిరించి పరిపాలన చేయలేరని హెచ్చరించారు. మరో 20 రోజుల్లో మిమ్మల్ని ఇంట్లో కూర్చో బెడతామని మాధవి హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జుపిటర్ ప్రసాద్, బండారు రాధికా, తెలంగాణ శ్రీను, గూడపాటి రమేష్, కట్టా కాళిదాస్, నేపాకా పద్మ, హుసేన్, జయంతి, బీజేపీ నేతలు చెరుకూరి తిరుపతిరావు, ఆవుల వెంకటేశ్వరరావు, నరేంద్రషా తదితరులు పాల్గొన్నారు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. నల్లచెరువుకు చెందిన వైసీపీ మహిళా నాయకురాలు షేక్ షంషున్ వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి కండువాలు కప్పిపార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మైనారిటీలపై వైసీపీ అవలంభిస్తున్న వైఖరిని నిరసిస్తూ, చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని నమ్మి టీడీపీలో చేరుతున్నట్లు షంషున్ తెలిపారు.

● 25వ డివిజన్ ఆదర్శనగర్‌లో డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి సుమారు 256 మంది తెలుగు దేశం పార్టీలో చేరారు. వీరందరికి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గళ్ళా మాధవి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 30వ డివిజన్‌లో టీడీపీ నేతలు కురంగి శ్రీనివాస్ పేరం అనితల నాయకత్వంలో పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు గళ్లా మాధవి సమక్షంలో పార్టీలో చేరారు. గళ్ళా మాధవి మాట్లాడుతూ కొన్ని రోజులు పోతే గుంటూరులో మరొక పార్టీ అనేది ఉండదు. మనం మాత్రమే ఉంటామేమో అన్నట్లుగా చేరికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని, రాష్ట్ర అభివృద్ధి ఖాయమని, తాను ఎప్పుడూ ప్రజలతోనే ఉంటానని ఆమె హామీ ఇచ్చారు.



ఎన్నికల ప్రచారంలో గళ్లా మాధవి, మూడు పార్టీల నేతలు

లోకేశ్, మాధవిల సమక్షంలో...

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, గళ్లా మాధవి సమక్షంలో పలువురు నేతలు టీడీపీలో చేరారు. బీసీ సెల్ నగర అధ్యక్షుడు, వడ్డెర సంఘ నేత పల్లపు శివరామకృష్ణ, పాదాల మధు, అబ్దుల్ ఖాన్, కాటమాల అశోక్, రఫీ టీడీపీలో చేరారు. వీరికి యువనేత లోకేశ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గుంటూరు ఫ్యాక్ట్స్ సోషల్ మీడియాపై ఫిర్యాదు

గళ్లా మాధవి భర్త గళ్లా రామచంద్రరావు ప్రతిష్ట దెబ్బతీసేందుకు ఆయన వ్యాపారాల్లో నష్టపోయి అప్పుల పాలైనట్లు ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలను ప్రచారంలో పెట్టిన 'గుంటూరు ఫ్యాక్ట్స్' అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై కేసు నమోదు చేయాల్సిందిగా ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి వార్తలు ప్రచురించే సంస్థలపై చర్యలు తప్పవని, అసత్య వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

కాపుల ద్రోహి ముఖ్యమంత్రి జగన్

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్

గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదని తూర్పు నియోజకవర్గం కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. పాతగుంటూరులో జరిగిన నియోజకవర్గ కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ కాపు కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశాడని, టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రిజర్వేషన్లను కూడా అమలు చేయకుండా వాటికి తూట్లు పొడిచాడని విమర్శించారు. కాపులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని, ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చారని, తన సొంత నిధులతో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే తాను కూడా రాజకీయాల్లోకి వచ్చానని, తనకు కాపులు అండగా ఉండాలని కోరారు. తనను గెలిపించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాపులకు కావాల్సిన సౌకర్యాలపై దృష్టి పెడతానని అన్నారు. నిర్మాణంలో ఉన్న కాపు భవనాలను వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేయించిందని, కూటమి ప్రభుత్వం రాగానే కాపు భవనాలను పూర్తి చేస్తామని తెలిపారు. టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాపులకు అతి తక్కువ రాజకీయ పదవులు ఇచ్చాడని, టీడీపీనే రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిందని తెలిపారు. రాష్ట్రంలో సీట్ల గెలుపులో కాపుల పాత్ర ఖచ్చితంగా ఉంటుందని తెలిపారు. జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ మాట్లాడుతూ రాష్టాభివృద్ధికి కోసమే పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాపు నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమత, జనసేన నాయకులు ఆళ్ల హరి, బీజేపీ నాయకులు శనక్కాయల అరుణ, డాక్టర్ ఉమా శంకర్, టీడీపీ నాయకులు ఎర్ర గోపు నాగేశ్వరరావు, ఐల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కాపు నేతలతో నసీర్, డేగల ప్రభాకర్, నంబూరు సుభాని తదితరులు



వస్త్ర వ్యాపారులతో మాట్లాడుతున్న నసీర్

వైసీపీ ప్రభుత్వంలో వ్యాపారులకు ఇబ్బందులు..

వైసీపీ ప్రభుత్వం వ్యాపారులను అనేక ఇబ్బందులకు గురి చేసిందని, అడ్డమైన పన్నులు విధించి ఆర్థికంగా ఎదగనివ్వలేదని కూటమి అభ్యర్థి నసీర్ అన్నారు. కాకానిరోడ్డులోని వైష్ణవి కాంప్లెక్స్‌లోని దుకాణ సముదాయ వ్యాపారులను బుధవారం ఆయన కలిశారు. తనను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనేక రూపాలలో పన్నులు వసూలు చేయటంతో వ్యాపారులు దెబ్బతిన్నారని, వారికి ఎటువంటి సౌకర్యలు కల్పించకపోగా నూతనంగా వ్యాపారాలు చేయాలనుకునే వారికి ప్రోత్సహించలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నేరెళ్ల సురేష్, అల్లం కన్నా, ఐ.వాసు, గుప్తా, కొణకళ్ల సత్యం, పుట్టా దుర్గాప్రసాద్, కనకారావు, శిఖకొల్లి అభి, అమర బాల, గజవెల్లి అంకారావు, బద్రీనాథ్, గణేష్, జనసేన నాయకులు ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గెలుపు..

టీడీపీ, జనసేన, బీజేపీలు సమన్వయంతో పనిచేస్తే టీడీపీ గెలుపు ఖాయమని నసీర్ అన్నారు. జనసైనికుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న పోరాట స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి వస్తున్నారని, వారి కృషి మరువలేనిదని అన్నారు. వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలని జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేశ్ అన్నారు.

పదిలో కెనడీ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24 : పదవ తరగతి ఫలితాల్లో స్థానిక కెనడీ స్కూల్ విద్యార్థులు మరోసారి సత్తాచాటారని డైరెక్టర్స్ శ్రీకాంత్ బాబు, డాక్టర్ శ్రీవిద్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు తిథిమైతి, ఆర్.గితికి 593 మార్కులతో సత్తాచాటారని పేర్కొన్నారు. పాఠశాలలో మరో 60 మంది 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకులు బేబి సావిత్రి, ప్రిన్సిపల్ బిజక్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ చైతన్య తదితరులు అభినందించారు.



విద్యార్థులతో డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు తదితరులు

శివారు కాలనీలకు కల్పతరువుగా..
వెంగళరావునగర్ బాలికల ఉన్నత పాఠశాల

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా 18 శివారు కాలనీల మధ్యలో వెంగళరావునగర్ మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యా సేవలందిస్తుండటం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం హైస్కూల్ వార్షికోత్సవం హెచ్ఎం పీ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థినుల ఉన్నత చదువులకు ఈ పాఠశాల బాటలు వేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనంలోనే బాల్యవివాహాలు చేయకుండా బాగా చదివించి మంచి ఉద్యోగం వచ్చి స్థిరపడ్డాక వివాహం గురించి ఆలోచన చేయాలన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన 90 మంది విద్యార్థులకు వాసవి క్లబ్ గోల్డ్, సిల్వర్ బ్రాంజ్ మెడల్స్‌ని బహూకరించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించి గుడ్ పేరెంట్, బ్యాడ్ పేరెంట్ నాటిక అందరిని ఆకట్టుకొన్నది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో టెన్నీస్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన గోలి జోషిత, అలోక్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 నాగేంద్రమ్మ, వాసవి క్లబ్ గుంటూరు అధ్యక్షుడు నగేష్, స్కోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి కొండలరావు, విద్యా కమిటీ చైర్మన్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



టెన్నీస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న వెంగళరావునగర్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పేదల కలలు సాకారం చేయటానికి కృషి : మంత్రి రజిని

గుంటూరు, ఏప్రిల్ 24: రాష్ట్రంలో పేదలందరి కలలను సాకారం చేయడానికి వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైసీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజినీ అన్నారు. నగరంలోని 29వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్, మాజీ కార్పొరేటర్ షేక్ సైదా, రామిరెడ్డి, వెంకటరెడ్డి, రమేష్, మజీద్, ఈశ్వరరావు, మున్నా, మాధవరావు పాల్గొన్నారు.

గుంటూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పవన్‌తేజ నామినేషన్

గుంటూరు, ఏప్రిల్ 24 : గుంటూరు లోక్‌సభ స్థానానికి, గుంటూరు పశ్చిమ స్థానానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ కాంగ్రెస్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లిన ఆయన రిటర్నింగ్ అధికారి ఎమ్ వేణుగోపాల్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. పవన్‌తేజ మాట్లాడుతూ రాష్ట్రానికి విభజన హామీలు అమలు కావాలన్నా, సంక్షేమం, అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమన్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ మంత్రి రజిని

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు (ఆంధ్రజ్యోతి),ఏప్రిల్ 24 : గత ఎన్నికల్లో తాను బీసీ బిడ్డనని గొంతు చించుకొని ఓట్లడిగిన మంత్రి విడదల రజిని నేడు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రచారంలో ఆ ప్రస్తావన ఎందుకు తేవటం లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి విడదల రజినిపై కనపర్తి శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం బడుగు, బలహీన వర్గాల వారిని తన కార్యాలయంలోకి అడుగు కూడా పెట్టనివ్వకుండా.... అగ్రవర్ణ పెత్తందార్లతో చెట్టాపట్టాలు వేసుకొని వేల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర ఆమెదని అన్నారు. సొంత పార్టీ నేతల వద్దే కోట్ల రూపాయలు వసూలు చేయటంతోపాటు చివరకు ఎంపీపీ, జట్పీటీసీ పదవులను కూడా అమ్ముకున్న అవినీతి అనకొండ రజినీ అని దుయ్యబట్టారు. సొంత పార్టీ నేతల తిరస్కరణతోపాటు, ఓటమి తప్పదని తెలుసుకున్న ఆమె గుంటూరుకు బదిలీ చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. చిలకలూరిపేట కంటే గుంటూరు నగరంలో రాబడి బాగుంటుందని, క్విట్ ప్రో కో పద్దతిలో అధిష్ఠానం పెద్దలతో ఒప్పందం కుదుర్చుకొని ఇక్కడికి వచ్చిందని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరానికి నిజాయితీగా సేవ చేయటానికి ముందుకొచ్చిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గళ్ళా మాధవిలను గెలిపించాలని కోరారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించటమేకాక, సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించటానికి సీఎం జగన్ ఇంటికి వచ్చిన చిరంజీవిని తీవ్రంగా అవమానించిన చరిత్ర జగన్ రెడ్డిదని అన్నారు. చిరంజీవి కుటుంబంపై జగన్ ముఠా విషం చిమ్ముతుంటే ఏరోజు నోరు విప్పని విడదల రజిని, ఆమె కుటుంబ సభ్యులు నేడు కులాన్ని రెచ్చగొడుతూ చీకటి రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. వారి ఆటలు సాగనివ్వమని పెమ్మసాని, మాధవి గెలుపును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు.

నేడు డాక్టర్ పరకాల ప్రభాకర్ 'అష్ట వంకరల నవభారతం' పుస్తక పరిచయ సభ

గుంటూరు, ఏప్రిల్ 24 : ప్రముఖ విశ్లేషకుడు, రచయిత డాక్టర్ పరకాల ప్రభాకర్ రచించిన 'అష్ట వంకరల నవభారతం' అన్న పుస్తక పరిచయ సభ గురువారం సాయంత్రం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరుగుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మన మంచి పుస్తకం, బుక్ లవర్స్ రీడర్స్ క్లబ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పుస్తక పరిచయ సభలో ప్రధాన పరిచయ కర్తగా విశ్రాంత హైకోర్టు జడ్జి జస్టిస్ కెజి శంకర్ హాజరుకానున్నారన్నారు. పుస్తక సమీక్షకులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, పుస్తక అనువాదకులు, సీనియర్ జర్నలిస్టు కొండూరు వీరయ్య వ్యవహరించనున్నారని తెలిపారు. పుస్తక ప్రియులందరూ ఈ సభకు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భావితరాలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలి

● ఎన్ఈసీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

గుంటూరు (విద్య), ఏప్రిల్ 24: భావితరాలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉపాధ్యాయ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు కృషి చేయాలని నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎన్ఈసీ) అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. జేకేసి కళాశాల రోడ్డులోని ఆర్‌వీఆర్ బీఈడీ కళాశాలలో బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెరుగైన బోధనతో నైతిక విలువల్ని నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, ప్రిన్సిపల్ ఆచార్య మోటూరి రవికుమార్, కోశాధికారి వి.కుప్పుస్వామి, విశ్రాంత ప్రొఫెసర్ వజ్జా రంగారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

ఉద్యోగులు అరెస్టు అయినప్పుడు బెయిల్ తీసుకునే విధానం

● ఈదర వీరయ్య

గుంటూరు, ఏప్రిల్ 24 : ఉద్యోగులు నేరారోపణపై అరెస్టు అయినప్పుడు బెయిల్ తీసుకునే విధానం గురించి పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బెయిల్ ఇవ్వటం నియమం, నిరాకరించటం, మినహాయింపు, బెయిలబుల్ నేరాలతో బెయిల్ ఇవ్వతగిన నేరాలలో వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చిన తరువాత నిందితుడిని విడుదల చేయాలన్నారు. బెయిల్ ఇవ్వతగని నేరాలలో కోర్టులు జాగ్రత్తగా పరిశీలించి బెయిల్ ఇవ్వటంపై నిర్ణయం తీసుకుంటాయన్నారు. అరెస్టు స్వేచ్ఛపై నిర్బంధం కనుక ఆ నిర్బంధం పై పరిమితులు విధించి స్వేచ్ఛను వీలైనంత మేరకు కాపాడటానికి బెయిల్ ఒక సాధనం అని, మధ్య యుగాలనాటి ఇంగ్లాండ్‌లో న్యాయమూర్తులు సంచరిస్తూ తీర్పులు చెప్పేవారన్నారు. ఇరు పక్షాల ప్రయోజనాలను సామాజిక శాంతిని దృష్టిలో పెట్టుకొని న్యాయస్థానం జాగ్రత్తగా బెయిల్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అరెస్టు అయిన తరువాత విడుదలైన వ్యక్తి అవసరమైనప్పుడు కోర్టుకు వస్తాడని నమ్మకం కలిగించటమే బెయిల్ లక్ష్యం అన్నారు. విచారణకు ముందు లేదా విచారణ కాలంలో దీర్ఘకాలం బందీగా ఉండటం వల్ల నిందితుడికి తీవ్ర నష్టం కలుగుతుందని సుప్రీం కోర్టు చెప్పిందని అన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బెయిల్ ఇవ్వతగిన నేరాలలో నిందితుడు పోలీసు అధికారి దగ్గర నుంచి బెయిల్ తీసుకోవచ్చన్నారు. బెయిల్ ఇవ్వతగని నేరం అంటే పోలీసు అధికారులు బెయిల్ ఇవ్వటానికి వీలు లేని నేరం అని న్యాయస్థానం ద్వారా మాత్రమే బెయిల్ పొందాల్సిన నేరం అని అర్థమని వివరించారు. సెక్షన్ -167(2), 389, 436 నుంచి 450 వరకు బెయిల్ గురించిన నియమాలను వివరిస్తున్నాయన్నారు. బెయిల్ ఇవ్వతగిన నేరాలలో నిందితుడికి బెయిల్ ఇచ్చే విషయమై కోర్టుకు విచక్షణాధికారాలు ఉంటాయని సెక్షన్-437 చెబుతున్నదని వీరయ్య తెలిపారు.



మాచర్ల ర్యాలీలో అసెంబ్లీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి, షరీఫ్ తదితరులు

బ్రహ్మారెడ్డి నామినేషన్‌లో జన సందోహం

మంచి నేతనే.. ఎన్నుకుంటాం

● తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24: వారంతో తొలిసారి ఓటు వేయబోయే నవ యువత.. అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలనుకునే లక్ష్యంతో తొలిఅడుగు వేస్తున్నారు. ఎవరికి ఓటు వేయాలి? తమ భవిష్యత్తును ఎవరు తీర్చిదిద్దుతారు అనే అంశాలు దృష్టిలో ఉంచుకుని ఓటు వేస్తామని చెబుతున్నారు. అంతేకాదు రాష్ట్ర భవిష్యత్ ఏమిటి? గతంలో పనిచేసిన, ప్రస్తుత పాలకుల తీరు ఏమిటి తదితర అంశాలు నిశితంగా విశ్లేషిస్తామని చెబుతున్నారు. సంక్షేమ పథకాలతోపాటు ఆర్థిక అభివృద్ధి ముఖ్యమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు వేయనున్న కొంతమంది యువత తమ అభిప్రాయాలు ఆంధ్రజ్యోతిలో పంచుకున్నారు. ఆ వివరాలు ఇలా..

నాయకుడికి నిబద్ధత ఉండాలి...



తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే తాము మంచి నాయకుల్ని మంచి నాయకున్ని ఎంచుకుంటాం. మంచి నాయకుడి వల్లే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అంతేకాదు వ్యవస్థలపై సరైన అవగాహన పెంచుకోవడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుల్ని ఎన్నుకుంటాం.

- ఏవీ హేమనందిని

ధన, కుల బలానికి అతీతంగా..



ఎన్నికల్లో ప్రధానంగా ధన, కుల బల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. ఇందుకు అతీతంగా ఉన్న నాయకుల్ని ఎంచుకువాలనేది లక్ష్యం. అభివృద్ధి చేసే నాయకుల్ని ఎన్నుకంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. యువత భవిష్యత్తుకు ఆధారమైన పరిశ్రమల, ఉద్యోగ, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చేవారే కావాలి.

- ఎస్‌వీ సాయి

అధికార దర్పం ఉండకూడదు...



నాయకులకు అధికార దర్పం, అవినీతి ఉండకూడదు. అధికారాన్ని సొంత దర్పాలకు, విలాసాలకు వినియోగించకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే ఎన్నుకుంటాం. రాజధాని నిర్మాణంతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమౌతుందని విశ్వసిస్తున్నాం. యువత ఓటు విలువను తెలుసుకోవడంతోపాటు దానికి విస్తృత ప్రచారం కల్పించాలి.

- షేక్ సానియా

ఓటు హక్కును బాధ్యతగా తీసుకోవాలి..



ఓటును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. తన ఓటు ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవడంతోపాటు దీనిని తన గెలుపుగా భావించాలి అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. తన ఓటు తన భవిష్యత్తుగా ఓటరు భావించాలి. ఐటీ పరిశ్రమలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- వి.సూర్యతేజ

ఓటు పైనే మన భవిష్యత్ ఆధారపడి ఉంది..



విజ్ఞానవంతులైన విద్యార్థులు మంచి నాయకున్ని ఎన్నుకుంటేనే సమాజం బాగుంగుంది. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆ దిశగా ఆలోచన చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోవాలి.

- ఎన్.హరీష్

సంక్షేమంతోపాటు అభివృద్ధి ముఖ్యం..



ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధికి పాటుపడే వారినే ఎన్నుకుంటాం. రాష్ట్రంలో భిన్న రకాల పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. డబ్బు ప్రభావానికి గురి కాకుండా ఓటును వినియోగించుకోవాలి.

- డి.అశోక్ వర్ధన్

నేటితో ముగియనున్న నామినేషన్లు

● ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా దాఖలు
● వారం రోజులు కోలాహలంగా సాగిన ప్రక్రియ
● టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల ఘట్టానికి జనాదరణ
● జనం లేక వెలవెలబోయిన వైసీపీ అభ్యర్థుల ర్యాలీలు

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న నామినేషన్ల అంకానికి గురువారం తెరపడనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైన సంగతి తెలిసిందే. చాలావరకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పక్షాలు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు మూడు సెట్లు నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీ అభ్యర్థులు ముందుజాగ్రత్తగా కుటుంబసభ్యులతో కూడా ప్రత్యేకంగా నామినేషన్లు దాఖలు చేయించారు. గురువారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ పర్వాన్ని ముగిం చుకున్న అభ్యర్థులంతా ప్రచారంలో దూకుడు పెంచారు. కీలకమైన స్క్రూటినీ ఘట్టం ఈ నెల 26న జరగనుంది. ఆ తర్వాత 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తదుపరి తుది పోరులో ఉండే అభ్యర్థులు, పార్టీలు, గుర్తులపై స్పష్టత రానుంది

టీడీపీలో పెరిగిన ధీమా..

నామినేషన్ల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పసుపు సైన్యం జోరు పెంచింది. టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం ఆయా నియోజకవర్గాల్లో జనజాతరను తలపించింది. ఎండలు మండిస్తున్నా లెక్కచేయకుండా ఊహించని రీతిలో జనం తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభ్యర్థులకు దిష్టితీసి వీరతిలకాలు దిద్దగా, యువత బైక్ ర్యాలీలు, కేరింతలతో సందడి చేసింది. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన శ్రేణులు, నేతలు అభ్యర్థుల వెంట నామినేషన్ల ర్యాలీలో పాల్గొని కూటమి ఐక్యతను చాటారు. మరోవైపు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లకు కనీస స్థాయిలో కూడా జనం కరువ య్యారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే నామినేషన్ల పర్వాన్ని వాయిదా కూడా వేసు కోవాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం ఆవరించిందని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు.

గుంటూరు లోక్‌సభకి మరో 10 నామినేషన్లు

గుంటూరు లోక్‌సభ స్థానానికి బుధవారం మరో 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ తరఫున నూనె పవన్ తేజనాయుడు, తెనాలి ప్రకాష్(బీఎస్‌పీ), సముద్రాల చినకోటయ్య(జై భీంరావు భారత్ పార్టీ), శివారెడ్డి యెంగ్రెడ్డి(నవతరం పార్టీ), ఉమర్ భాషా షేక్(జన సహాయక శక్తి), ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కన్నెబోయిన వంశీకృష్ణ మూడు సెట్లు, పిల్లి బాబురావు రెండు సెట్లు, దొప్పలపూడి వీరదాసు, వెంకట శివ రామాంజనేయులు వంకాయలపాటి నామినేషన్లను గుంటూరు లోక్‌సభ ఆర్‌వో ఎం వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు. గురువారం ఒక్క రోజే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉందని సమాచారం.

నామినేషన్ల కోలాహలం



వినుకొండ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న జీవీ, కన్నా, మక్కెన



రోడ్‌షోలో పాల్గొన్న భారీ జనసందోహం

భానుడు భగభగమంటున్నా.. నామినేషన్ల ఉత్సవాలు జనజాతరను తలపించాయి. బుధవారం నామినేషన్ల సందర్భంగా కూటమి అభ్యర్థులు చేపట్టిన రోడ్‌షోలతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. ఎక్కడికక్కడ కూటమిశ్రేణులతో పాటు యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. యువత సందడి, నేతల సత్కారాల మధ్య అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అభ్యర్థుల ర్యాలీల్లో సంప్రదాయ డప్పు వాయిద్య కళాకారులు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- గుంటూరు





చింతలపూడి గంజే షాహిద్ బాబా దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న నరేంద్రకుమార్ తదితరులు



రేపల్లెలో నామినేషన్‌కు బయలుదేరే ముందు ఇంటి వద్ద ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇస్తున్న డాక్టర్ మంజుల, కమల



నామినేషన్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



పొన్నూరులో నరేంద్రకుమార్ నామినేషన్‌కు తరలివచ్చిన టీడీపీ, జనసేన అభిమానులు



ప్రత్యేక ప్రార్థనల్లో మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలిలో మనోహర్ నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన ఉమ్మడి పార్టీల శ్రేణులు



సుమారు 22 మంది రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోకి వెళ్తున్న దృశ్యం



బస్టాండ్‌లోకి బస్సులు రాకుండా అడ్డుపెట్టిన బారికేడ్లు

వారికో రూల్.. వీరికో రూల్!



ట్రాక్టర్ గుద్దుకోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న కే స్వామిబాబు

● వైసీపీకి తొత్తులుగా అధికారులు
● ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్
● తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
● మహేష్‌రెడ్డి నామినేషన్లో ఏరులై పారిన మద్యం

గురజాలటౌన్, ఏప్రిల్ 24: గురజాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి ఒక రూలు.. వైసీపీ అభ్యర్థికి మరో రూలు విధిస్తున్నారు. ఈనెల 22వ తేదీన సోమవారం గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. ఆ రోజు పోలీసు అధికారులు అడుగడుగునా రూల్స్ విధిస్తూ హుకుం జారీ చేశారు. టీడీపీ ఆధ్వర్యాన ఒక్క డీజే ఏర్పాటు చేయగా అనుమతి లేదంటూ దానిని కూడా నిలిపివేశారు. ఆర్డీవో కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యరపతినేనితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించారు. యరపతినేని పీఏ కోటేశ్వరరావు కొన్ని పత్రాలను యరపతినేనికి ఇచ్చేందుకు వచ్చినప్పుడు అక్కడే ఉన్న ఓ సీఐ అడ్డుకున్నారు. కొన్ని పత్రాలు ఇవ్వాలి సార్ అని బతిమాలినా వినలేదు. టీడీపీ వాహనాలు మొత్తం దండివాగు వద్దనే ఆపేశారు. అనుమతి ఉన్న వాహనాలను కూడా అనుమతించలేదు.

వైసీపీ వర్తించవా..

వైసీపీ గురజాల అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ చేశారు. వైసీపీ నేతలు భారీగా డీజేలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సుమారు 10 డీజేలతో భారీ ధ్వనులు సృష్టించారు. మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోలేదు. పార్కింగ్ స్థలాన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను బస్టాండ్ లోపలికి రానివ్వకుండా పోలీసులు బయట నుంచే పంపించారు. ఇదిలా ఉండగా నామినేషన్ వేసేందుకు వచ్చిన కాసు మహేష్‌రెడ్డితోపాటు సుమారు 30 మంది బారికేడ్లు దాటి వచ్చారు. అయితే 22వ తేదీన విధులు నిర్వహించిన సీఐనే బుధవారం కూడా విధులు నిర్వహించారు. కాగా అక్కడే కేంద్ర బలగాలతోపాటు డీఎస్పీ స్థాయి అధికారులు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరావు ఉండడం గమనార్హం. దీనిపై ఆర్డీవో కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా.. మహేష్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు వచ్చారని చెప్పారు.

పక్షపాత ధోరణి..

ప్రత్తిపాడు, ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో అధికారులు పూర్తిగా పక్షపాత ధోరణిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల పట్ల ఒక తీరుగా.. వైసీపీ నాయకుల పట్ల ఒక తీరుగా పోలీసులు వ్యవహరిస్తున్న వైనం ఇప్పుడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బూర్ల రామాంజనేయులు నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రచార వాహనాన్ని అక్కడే ఆపించి, అభ్యర్థితో పాటు ఐదుగురికి అక్కడి నుండే లోపలకు అనుమతించారు. కాని వైసీపీ అభ్యర్థి విషయంలో తహసీల్దార్ కార్యాలయం వరకు అభ్యర్థి ప్రచారవాహనాన్ని అనుమతించారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆగిన వైసీపీ వాహనాలను పక్కకు పంపించే ప్రయత్నం కూడా చేయలేదు. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ నామినేషన్ పూటుగా మద్యం తాగిన యువత ఇష్టానుసారంగా వాహనాలను నడపటం ఎదుటి వ్యక్తుల ప్రాణాలమీదకు తెచ్చింది. ఈ ర్యాలీకి ట్రాక్టర్లను సైతం తెచ్చి వాటితో విన్యాసాలు చేయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలేనికి చెందిన కొండేపాటి స్వామిబాబు కాలుపై ట్రాక్టర్ ఎక్కింది. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. చివరికి చిన్నారులను సైతం ఇందులో భాగస్వాములను చేశారు. ఆర్వో కార్యాలయం వద్ద అభ్యర్థి ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు. కాని బలసాని కిరణ్‌కుమార్ ఆర్వో కార్యాలయం చుట్టూ తిరిగి ప్రజలకు అభివాదం చేశారు.

టీడీపీ సానుభూతి పరుల వాహనాలపై దాడి

వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో వైసీపీ మూక బరితెగించారు. ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల వాహనాలపై ఎగబడ్డారు. కారులో నుంచి తెలుగుదేశం పార్టీ కండువా కనిపిస్తుండంతో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు కారుపై ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎలాగోలా అక్కడి తప్పించుకుని వెళ్లిపోయారు.



ఒక చేత్తో క్వార్టర్, వాటర్ బాటిల్.. మరో చేత్తో వైసీపీ జెండాతో ర్యాలీలో ఇలా...



టీడీపీ సానుభూతిపరుల వాహనంపై దాడి చేస్తున్న వైసీపీ మూక



ఆర్వో కార్యాలయం వరకు వచ్చిన వైసీపీ అభ్యర్థి ప్రచార వాహనం

నారా లోకేశ్, పెమ్మసాని గెలుపు కోరుతూ పూజలు



చిర్రావూరులో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, ఏప్రిల్ 24: తాడేపల్లి మండలం చిర్రావూరు శివాలయంలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారం ప్రారంభించి ఎమ్మెల్యేగా నారా లోకేశ్, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్ అత్యధిక మెజారిటీతో గెలవాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు, టీడీపీ నేతలు పోకల వెంకటేశ్వరరావు, నన్నపనేని అర్జునరావు, ముక్కపాటి రవి, మానేపల్లి కిరణ్, జనసేన నేతలు అంకం కాశీకృష్ణ, శీర్ల లాల్‌చంద్, పోకల శివయ్య, బీజేపీ నేతలు చందు, సుబ్బారావు, జనార్దన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భయంలేదు బాబుంటే.. భవిష్యత్తుకు గ్యారంటీ

● ముమ్మరంగా తెలుగుమహిళల ప్రచారం



దుగ్గిరాలలో బాబు సూపర్-6పై ప్రచారంలో పాల్గొన్న టీడీపీ మహిళలు



చిలువూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

దుగ్గిరాల, ఏప్రిల్ 24: ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. గ్రామాల్లో నువ్వా.. నేనా అన్నట్లుగా జరుగుతున్న ప్రచారంలో టీడీపీ మహిళలు ముందంజలో ఉన్నారు. గ్రామవీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ బాబు సూపర్-6 పథకాలపై ప్రచారం చేస్తున్నారు. భయంలేదు బాబుంటే.. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ పాటలు పాడుతూ, టీడీపీకి ఓటువేసి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలంటూ పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దుగ్గిరాలలో మహిళలు బృందాలుగా ఏర్పడి జరుపుతున్న ప్రచారానికి విశేషమైన స్పందన లభిస్తోందని పార్టీ నాయకులు మరింత ఉత్సాహంగా పనిచేయాలంటూ కార్య కర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. చిలువూరు గ్రామంలో దళితవాడలోనూ, ముస్లిం కాలనీల్లోనూ ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. రచ్చబండ కార్యక్రమాలు మరోవైపు ఇంటింటికీ స్థానిక నాయకులు ప్రచారంతో గ్రామా ల్లో కార్యకర్తలు తమ ప్రచారంతో ప్రజల్లో టీడీపీపై ఆసక్తిని పెంచుతూ వెళుతున్నారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజ మరియమ్మ, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, తోటకూర సీతారామయ్య, యడ్ల బాలకృష్ణ, గద్దె కుమారి, సాదిక్, ఏసుపాదం పలువురు తెలుగుమహిళలు, నాయకులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 24: మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఏక్విటీ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగగా.. విద్యార్థులకు రాత, శ్రవణ పరీక్షలు, బృంద చర్చలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన 120 మంది విద్యార్థుల్లో 27 మందిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. వీరిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 11మంది ఉన్నారని నిర్మల కళాశాల కార్యదర్శి జీ.నిర్మలజ్యోతి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శంఖుల కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబు, ప్రాతూరి అశోక్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నేడు సీపీఐ, సీపీఎం అభ్యర్థుల రోడ్ షో

● 100 మంది కళాకారులతో కమ్యూనిస్టుల ధూం.. ధాం...

తాడేపల్లి, ఏప్రిల్ 24: ఇండియా కూటమి అభ్యర్థులుగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న సీపీఎం నేత జొన్నా శివశంకర్, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్‌ల రోడ్ షో జయప్రదం చేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి విజ్ఞప్తి చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో గురువారం 7 గంటలకు సుందరయ్య చౌక్ నుండి ఈ రోడ్ షో ప్రారంభమవుతుందని అంబేద్కర్ సెంటర్‌లో ముగుస్తుందని సాయంత్రం 4.30 గంటలకు ఉండవల్లి కూడలిలో రోడ్ షో ఉంటుందని రవి తెలిపారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు ప్రజలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా బుదవారం వడ్డేశ్వరంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ గోపాలరావు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులను కలిసి వామపక్ష నేతలను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

దళితులు వైసీపీకి ఎందుకు ఓటు వేయాలి?

● ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఏప్రిల్ 24: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన ఆదేశ సూత్రాల ప్రకారం తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలు అందిస్తుంటే వైసీపీ ప్రభుత్వం దళితులకు ఇచ్చే 27 పథకాలు రద్దు చేసినందుకు ఓట్లు వేయాలా?, అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని తీసి వేసినందుకు ఓట్లు వేయా లా?, చంద్రన్న బీమా, క్రిస్మస్ కానుకలు తీసి వేసినందుకా?, శ్మశానాలకు కాంపౌండ్లు కట్టకుండా ఆ నిధులను తీసి వేసినం దుకా?, మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్‌ను పిచ్చివాడిని చేసి చంపినందుకా?, దళితుడిని గుండు గీసి అవమానించినందుకా? వైసీపీ ఎంఎల్‌సీ అనంతబాబు దళిత డ్రైవర్‌ను చంపి వేసి డోర్ డెలివరి చేసినందుకు దళితులు వైసీపీకి ఓట్లు వేయాలా? అని ఆయన ప్రశ్నించారు. బుధవారం ఫిరంగిపురంలోని విజ్ఞా నపురంలో జరిగిన సభలో నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి రాష్ట్రాన్ని దోచుకుతిన్నందుకు వైసీపీ ఓట్లు వేయాలా? అని ఆయన అన్నారు. సంక్షేమం పేరుతో వైఎస్ జగన్ పప్పు బెల్లాల్లా ఖర్చు పెడుతూ బాలుడికి చాక్లెట్ ఇచ్చి నక్లెస్ కాజేసిన దొంగ కావలాలా?, పథకాలు ఇచ్చి కుటుంబాలు బాగు చేసే తెలుగుదేశం కావాలో తేల్చు కోవాలన్నారు. పేదలకు సేవచేయటానికే రాజకీయాల్లోకి వచ్చానని ఆయన అన్నారు. నేను మీవాడిని, మీరు ఆదరించండి, నేను మేలు చేసి చూపిస్తానని ఆయన తెలిపారు. కార్మెల్ కొండకు ఘాట్ రోడ్డు మంజూరు చేయిస్తానని, విజ్ఞానపురం రూపురేఖలు మారుస్తానని, రూ.కోటి వ్యయంతో విజ్ఞానపురం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. జగన్ క్రిష్టియన్ అంటూ నమ్మబలుకుతున్నాడని, ఐతే ఎయిడెడ్ స్కూళ్ళను ఎందుకు రద్దు చేస్తున్నాడని ఆయన ప్రశ్నించారు. అనంతపూర్ నుంచి అమరావతికి ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం జరిగితే ఈ ప్రాంత భూముల రేట్లు పెరిగి పేదలకు పనులు దొరికేవని ఆయన అన్నారు. పేదల సంక్షేమం కోసం పాటు పడేది టీడీపీయేనని తెలిపారు. కనుకనే టీడీపీ అభ్యర్థులమైన తనకు, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

● ఐదేళ్ళలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం
● టీడీపీ కూటమితోనే సమ న్యాయం
● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రామాంజనేయులు



వరగానిలో ఇంటింటి ప్రచారంలో భాగంగా విజయకేతనం చూపుతున్న రామాంజనేయులు, తెలుగు మహిళలు

పెదనందిపాడు, ఏప్రిల్ 24: త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించి సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలపరిధిలోని వరగానిలో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి రాగానే మద్యంపానం నిషేధాన్ని అమలు చేశాకే ఓటు అడిగేందుకు వస్తానని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పారని, మాటిచ్చి మడమ తిప్పితే ఓట్లు వేయొద్దని పదేపదే చెప్తున్న జగన్‌కు ప్రజలు ఓటెలా వేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేసే పథకాలను, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు ప్రవేశపెడితే వాటిని తొలగించిన ఘనత జగన్‌రెడ్డిదేనన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం టీడీపీ కూటమితోనే సాధ్యమని, సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, జనసేన, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్లు కొర్రపాటి నాగేశ్వరరావు, పరాంకుశం శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోపర్తి చెంచయ్య, జంపని హనుమంతరావు, గ్రామ అధ్యక్షుడు చెన్నుపాటి సురేంద్ర, తెలుగుయువత నాయకులు కాండ్రు ప్రసాద్, నాయకులు పోపూరి వెంకటప్పయ్య, బండారు రాంబాబు, సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు, దిరిశాల శ్రీనివాసరావు, రామినేని శ్రీనివాసరావు, మాదినేని శౌరి బాబు, బత్తిని వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సూపర్ సిక్స్ పథకాల ప్రచారం

తుళ్లూరు సమావేశంలో టీడీపీ నేతల తీర్మానం





సమావేశానికి హాజరైన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మాట్లాడుతున్న తుళ్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు

తుళ్లూరు, ఏప్రిల్ 24: ఇంటింటికి తిరిగి టీడీపీ మ్యానిఫెస్టోలో పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను, బీసీల సంక్షేమం కోసం కేటాయించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సవివరంగా చెప్పాలని టీడీపీ నేతలు నిర్ణయించా రు. తుళ్లూరు మండలంలో ఒకటి రెండు ఊళ్లు తప్ప అన్ని గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ ఎంపీ అభ్యర్థి ప్రచారం చేశారు. తదుపరి స్థానికంగా ఏ గ్రామానికి ఆ గ్రామంలో ప్రచారం చేయాలని బుధవారం తుళ్లూరు పార్టీ కార్యాలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు అధ్యక్షతన జరిగిన నాయకులు కార్యకర్తల సమావేశంలో తీర్మానించారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు అర్థమయ్యేలా వివరించాలని సమావేశంలో కార్యకర్తలు అభిప్రాయాలను తెలిపారు. చంద్రబాబునాయుడు లాంటి సమర్థుడు ముఖ్యమంత్రి అయితే సంక్షేమం అభివృద్ధి జోడెద్దుల బండి లాగా ముందుకు దూసుకు పోతుందనేది తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు చెప్పారు. ప్రతి గ్రామంలో.. వైసీపీ ప్రభుత్వం దోపిడి, దమనకాండ, అరాచకాల గురించి తెలిపి, టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకుండే పూర్తి స్థాయి భద్రత గురించి ప్రజలకు వివరించే విధంగా ప్రచారం జరగాలని మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు రాజధాని గ్రామాల్లో సిద్ధమవుతున్నారు. అమరావతిని నిర్వీర్యం చేసి దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి లేకుండా చేసిన వైసీపీని చిత్తుగా ఓడించాల్సిన ఆవశ్యకత గురించి వివరించటానికి నడుం బిగించారు.

కంతేరులో కాపునాడు నాయకుల ప్రచారం



కంతేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాపునాడు నాయకులు

తాడికొండ, ఏప్రిల్ 24: రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని తాడికొండ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు దాసరి రంగారావు అన్నారు. బుధవారం తాడికొండ, కంతేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్నా, రాష్ట్రాభివృద్ధి చేయాలన్నా ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందన్నారు. కూటమి బలపరిచిన గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తాడికొండ మండల కాపునాడు అధ్యక్షుడు బాదినేని వెంకట్రావు, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు గులక వరపు నరేష్, రాజధాని అమరావతి కాపునాడు అధ్యక్షులు పాలకాయల వెంకటేశ్వరరావు, సుంకర హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యం

● నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాడికొండ, ఏప్రిల్ 24: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. బుధవారం పొన్నెకల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తారని తెలిపారు. ముద్రా రుణాలను రూ.20 లక్షల వరకు పెంపు చేశారని తెలిపారు. దేశాభివృద్ధే లక్ష్యంగా మోదీ సారథ్యంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోటా సాంబ శివరావు, షేక్ బిలాల్, సరిపూడి సాంబశివరావు, ఆరుద్ర గోపి, గుంటుపల్లి కృష్ణ, మల్లవరపు కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి

● తుళ్లూరులో జనసేన టీడీపీ బీజేపీల ఇంటింటి ప్రచారం



తుళ్లూరులో టీడీపీ సూపర్-6 పథకాలు వివరిస్తున్న మూడు పార్టీల నాయకులు, మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 24: ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు బుధవారం తుళ్లూరు ఎస్సీ కాలనీలో ప్రచారం మొదలుపెట్టారు. ఇంటింటికి తిరిగి సూపర్-6 పథకాల గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. అమరావతి జీవనభృతి పింఛన్ పెట్టింది టీడీపీ ప్రభుత్వమని తెలిపారు. జగన్‌రెడ్డి దానిని ఐదు వేలు ఇస్తాను అని చెప్పి ఐదేళ్లయిందన్నారు. ఓట్ల కోసం రెండు నెలలు ఐదు వేలు ఇస్తున్నాడని తెలిపారు. గత ఎన్నికల ముందే టీడీపీ ప్రభుత్వం ఆరు వేలు ఇస్తామని చెప్పిందని తెలియజేశారు. రాజధానిలో రైతులతో పాటు కూలీలకు అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు అన్నారు. రాజధాని నిర్మాణ పనులు జరుగుతుంటే ఉపాధి ఉద్యోగావకాశాలు మెండుగా ఉండేవన్నారు. నిర్మాణ కంపెనీలను పారద్రోలి ఉపాధి లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, బండ్ల పట్టయ్య, జమ్ముల అనిల్ కుమార్, పువ్వాడ గణేష్, మాజీ ఎంపీటీసీలు, దళిత జేఏసీ నేతలు మేరిగి నాగేశ్వరావు, కూచిపూడి కొండయ్య, బూత్ కన్వీనర్ జెట్టి దుర్గారావు, కంతేటి బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు కొమ్మినేని సత్యనారాయణ, జనసేన నాయకులు సురేంద్ర మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలోత్సవం వేసవి శిక్షణ శిబిరం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 24: ఎంటీఎంసీ బాలోత్సవం ఆధ్వర్యంలో గురువారం నుంచి మే 5 వరకు బాలల హరివిల్లు పేరుతో వేసవి శిక్షణ శిబిరం తాడేపల్లి బైపాస్ అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు, బాలోత్సవ్ రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో సైన్స్ చిత్రలేఖనం, కథలు, హ్యాండ్ రైటింగ్, మ్యాజిక్ గణితం, ఇంగ్లిష్, తదితర వాటికి సంబంధించి నిష్ణాతులతో శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు బాలోత్సవ్ బ్రోచర్‌ను నిర్వాహకులు మురళీకృష్ణ, గాదె సుబ్బారెడ్డి, బాలకృష్ణ, రమ్య ఆవిష్కరించారు.

క్రీడాకారులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల పాలకవర్గ సభ్యులు

పెదనందిపాడు, ఏప్రిల్ 24 : స్థానిక లయన్స్ మాంటిస్సోరీ సీబీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లేజర్ రన్ పోటీల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లోకయ్య బుధవారం తెలిపారు. నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి లేజర్ రన్ 600మీ. పోటీల్లో అండర్ 11 విభాగంలో పాలపర్రుకు చెందిన అన్నలదాసు అజిత్‌సిన్హా బంగారు పతకం, అండర్ 9 విభాగంలో అన్నలదాసు రాహుల్ కన్నా సిల్వర్ పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను గౌరవాధ్యక్షుడు దాసరి శేషగిరిరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి, అధ్యక్షులు అరవపల్లి కృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరిన నేతలు, కార్యకర్తలతో కలిసి అభివాదం చేస్తున్న నారా లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 24: మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కలసి రావాలని యువనేత నారా లోకేశ్ ఇచ్చిన పిలుపునకు మంగళగిరి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఉండవల్లిలోని నివా సంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన వంద మంది టీడీపీలో చేరారు. ఉండవల్లి గ్రామానికి చెందిన శ్రీరామ వాసుదేవ లక్ష్మీతాయారు ఆధ్వర్యంలో 15 మంది, తాడేపల్లి పట్టణం 12వ వార్డుకు చెందిన వైసీపీ నేతలు యేమినేని శివనాగేశ్వరరావు, కొలకలూరు వెంకటరత్నం, మహమ్మద్ పఠాన్ ఆధ్వర్యంలో 50 మంది, తాడేపల్లి పట్టణం 20వ వార్డుకు చెందిన షేక్ రాఖీబ్ ఆధ్వర్యంలో పది మంది, కాజ గ్రామానికి చెందిన చిలకలపూడి కిషోర్, మేడా మంగమ్మ ఆధ్వర్యంలో పది కుటుంబాలు, దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన పల్లె నవీన్, నెమలికంటి అనంత్ ఆధ్వర్యంలో 15 మంది టీడీపీలో చేరారు. వీరందరికీ నారా లోకేశ్ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి ప్రజలకు సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చానని, పేదరికంలేని మంగళగిరిని స్థాపించడం లక్ష్యమని తెలిపారు. మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దుతానని, అందుకోసం ప్రజలందరూ కలిసికట్టుగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మంగళగిరిలో 19 నామినేషన్లు దాఖలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియనుంది. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. 11 మంది అభ్యర్థుల నుంచి 19 నామినేషన్లు దాఖలైనట్టు జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి తెలిపారు. ఇప్పటివరకు 37మంది అభ్యర్థుల నుంచి 57 నామినేషన్లు అందినట్టు ఆమె వెల్లడించారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు



జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నేతలు

తాడికొండ, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు అన్నారు. బుధవారం రాత్రి తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50సంవత్సరాలకే పెన్షన్ అమలు, నెలకు రూ.4 వేలు పెన్షన్ పథకం అమలు చేస్తామన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామన్నారు. బీసీలపై దాడులు, దౌర్జన్యాల నుంచి రక్షణ కోసం ప్రత్యే రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామన్నారు. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. చట్టబద్ధంగా కుల గణన నిర్వహిస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరించి పెళ్లి కానుకలు రూ.లక్షకు పెంపుదల చేస్తామన్నారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యాపథకాలు తిరిగి తెస్తామన్నారు. బీసీ భవనాలు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేసి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లా శ్రీనివాసరావు, కొల్లికొండ వెంకట్, నియోజకవర్గ బీసీ సెల్ సెక్రటరి ఉల్లం శ్రీనివాసరావు, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి నల్లిబోయిన వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ బైరబోయిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో కూటమి నేతల విస్తృత ప్రచారం



పెదవడ్లపూడిలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 24: ఎన్‌డీఏ కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లకు మద్దతుగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు బుధవారం సాయంత్రం మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ లోకేశ్, పెమ్మసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్, అన్నే చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, గడ్డిపాటి అపర్ణ, మద్దుకూరి శివచరణి, మాదినేని ఝాన్సీ, జనసేన గ్రామ అధ్యక్షుడు నడపన దుర్గా రావు, బీజేపీ నేత జవ్వాది అమ్మయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 12 మంది జూదరులు

తుళ్లూరు, ఏప్రిల్ 24: తుళ్లూరు పోలీసులు 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం ఉద్దండ్రాయునిపాలెంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావటంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.21,350 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఫరీద్, జాఫర్ కమిటీ సభ్యులు

టీడీపీకి ముస్లిం కమిటీల మద్దతు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ, ముస్లిం పరిరక్షణ కమిటీ, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు తెలిపారు. బుధవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన పార్టీలు బీజేపీతో ఉన్నప్పటికీ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, మత విద్వేషాలను అరికట్టేందుకు సమర్థవంతమైన నాయకుడు అవసరమన్నారు. స్వప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించలేక సాగిలపడ్డ ప్రభుత్వాన్ని దూరంగా ఉంచాలన్నారు. రాష్ట్ర పరిస్థితులను రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. షేక్ ఫరీద్, సయ్యద్ జాఫర్, కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

సాహిత్య, కళారంగాలకు దుర్గాప్రసాద్ ఎనలేని సేవ

● రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 24: తెనాలి పట్టణంలో సాహిత్యం, కళారంగాల కోసం నాగళ్ల దుర్గాప్రసాద్ ఎనలేని సేవ చేశారని పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు ప్రశంసించారు.. దుర్గా ప్రసాద్ జయంతి పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారుల సంఘంతో పాటు ప్రజ్వలిత సంస్థను ఏర్పాటు చేసి ఆయన పలు కార్యక్రమాలు నిర్వహించి ఎందరో మన్ననలు పొందారన్నారు. దేవిశెట్టి కృష్ణారావు, కొండమూడి రమేష్, బాబురావు, మధు, రాజు, సూర్య, యోహాను, రామరాజు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు నీతి కథలు చెబుతున్న గ్రంథాలయసంస్థ జిల్లా కార్యదర్శి సుబ్బరత్నమ్మ

వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

● గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సుబ్బరత్నమ్మ

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయసంస్థ జిల్లా కార్యదర్శి సుబ్బరత్నమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కొలకలూరు శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించి అందున్న సదుపాయాలపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులకు వచ్చిన చిన్నారులకు స్వయంగా కథలు చెప్పి అందులో నీతిని బోధించారు. అనంతరం గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించి గ్రంథాలయాధికారిని కడియాల సుజాత పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 24: వేసవి సెలవుల్లో బాల బాలికలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ కోరారు. కొత్తపేటలోని మహిళ గ్రంథాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. రికార్డులు తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో రకాల పుస్తకాలు, కథలు, విజ్ఞానం అందించే అంశాలు ఉన్న పుస్తకాలన్నింటిని వినియోగించుకోవాలన్నారు. నిరుద్యోగ యువత కోసం ఎప్పటికప్పుడు పుస్తకాలను గ్రంథాలయాలకు పంపిణీ చేస్తున్నామని వాటిని చదివి ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలన్నారు. లైబ్రేరియన్ అంజని పాల్గొన్నారు.



గ్రంథాలయ రికార్డులు పరిశీలిస్తున్న సుబ్బరత్నమ్మ



నరేంద్ర నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, బ్రహ్మణకోడూరు ఆలయంలో నాగారుపమ్మను పూజిస్తున్న నరేంద్ర కుమార్, ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నరేంద్రకుమార్

నరేంద్ర నామినేషన్‌కు భారీగా నాయకులు, కార్యకర్తలు

పెదకాకాని, ఏప్రిల్ 24: పొన్నూరులో టీడీపీ అభ్యర్థి నరేంద్ర కుమార్ నామినేషన్‌కు పెదకాకాని మండలం నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, వెనిగండ్ల, అగతవరపాడు, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, రామచంద్రపాలెం, గొల్లమూడి, వెంకటకృష్ణాపురం, దేవరాయభట్ల పాలెం, తంగెళ్లముడి, అనుమర్లపూడి గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. వేలాది మందిగా ధూళిపాళ్ల నరేంద్ర నామినేషన్‌కు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. పెద్దఎత్తున నరేంద్ర బ్యానర్లను, ఫొటోలను పట్టుకొని ర్యాలీలు చేస్తూ పొన్నూరు తరలివెళ్లారు. నరేంద్ర నామినేషన్లు పెదకాకాని మండలం నుంచి విశేషంగా తరలివెళ్లారు.



పెదకాకాని నుంచి ర్యాలీ గా బయలుదేరిన టీడీపీ నాయకులు కార్యకర్తలు



నామినేషన్‌కు తరలివస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గజమాలలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు, ర్యాలీలో మనోహర్ అభివాదం

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

టీడీపీ నాయకుల పిలుపు

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: తెనాలి ప్రాంత అభివృద్ధికి ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఎంపీగా పెమ్మసానిని గెలిపించుకుందామని టీడీపీ సీనియర్ నాయకులు, హెచ్‌సీపీ ఎండీ కరణం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నాదెండ్ల మనోహర్ నామినేషన్‌ను పురస్కరించుకుని కొలకలూరు నుంచి భారీగా ఉమ్మడి పార్టీ శ్రేణులతో ర్యాలీగా మనోహర్‌కు మద్దతు తెలిపారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



కొలకలూరు నుంచి ర్యాలీగా వెళుతున్న గ్రామ సర్పంచ్ ప్రీతి, కరణం వెంకటేశ్వరరావు ఉమ్మడి పార్టీ శ్రేణులు



మనోహర్‌కు మద్దతు తెలుపుతూ ర్యాలీగా వెళుతున్న వీరవల్లి మురళి, నాగభూషణం, సూరపనేని నాగేశ్వరరావు, ముప్పవరపు సాంబశివరావుతదితరలు

వైసీపీకి డిపాజిట్లు కూడా రావు: వీరవల్లి మురళి

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: నియోజవర్గ ప్రజలందరూ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ వెంటే ఉన్నారని గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. బుధవారం ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు మద్దతు తెలుపుతూ అంగలకుదురు గణేష్‌యూత్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి వీరవల్లి మురళి, గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరరావు, మమత బ్రదర్స్ సూరపనేని నాగేశ్వరరావు, ముప్పవరపు సాంబశివరావుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్ళారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గతంలో ప్రజాప్రతినిధిగా మనోహర్ ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి చిరస్మరణీయంగా ఉందని వైసీపీకి ఈ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు.

మనోహర్‌కు శుభాకాంక్షలు తెలిపిన రామాంజనేయులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు పత్తిపాడు టీడీపీ అభ్యర్థి మాజీ ఐఏఎస్ రామాంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన రామాంజనేయులు మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందించి భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు.



మనోహర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రామాంజనేయులు

మనోహర్‌కు మద్దతుగా...

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 24: రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధి కోసం నాదెండ్ల మనోహర్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించుకుందామని టీడీపీ నాయకుడు రావి భగవత్‌దత్ అన్నారు. స్థానిక చెంచుపేటలో బుధవారం జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా అయనకు మద్ధతుగా భారీగా పార్టీ శ్రేణులతో కలసి వెళ్ళారు. కార్యక్రమంలో సుధా రజనీకాంత్, కొమ్మూరు వెంకటేశ్వర్లు, రావిపాటి శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్24: అక్రమంగా మద్యం కలిగివున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అర్బన్ ఎస్సై ఎం రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం బాపట్ల బస్టాండ్ వద్ద సోదాలు నిర్వహిస్తుండగా నాగాయలంకకు చెందిన వై వెంకటేశ్వరరావు, డి రాజు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారంచగా 13 మద్యం బాటిళ్ల లభించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు.

తెనాలిలో 16 నామినేషన్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 24: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికకు 16 నామినేషన్లు దాఖలు అయ్యాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రెండు సెట్లు నామినేషన్లు వేశారు. ఒక సెట్‌పై దేసు శ్రీనివాసరావు, మరో సెట్‌పై అక్కిదాసు కిరణ్‌కుమార్‌లు ప్రతిపాదనలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరుపున నాదెండ్ల మనోహర్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆయన నామినేషన్‌ను పదిమంది ప్రతిపాదించారు. స్వతంత్ర్య అభ్యర్థిగా తుమపాల నరేంద్ర, తెలుగు జనత పార్టీ అభ్యర్థిగా కొండూరు నాగరాజు, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ జానీబాషా నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. ఇప్పటివరకు బీఎస్పీ తరుపున కారుమంచి సునీల్‌సందీప్ రెండు సెట్లు నామినేషన్లు, పిరమిడ్ పార్టీ తరుపున జింకా మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ బాషీద్, ముస్లిం లీగ్ పార్టీ తరపున పఠాన్ అమానుల్లాఖాన్ నాలుగు సెట్ల నామినేషన్లు వేశారు. తెలుగు విజయం పార్టీ నుంచి చుక్కపల్లి ప్రసాద్, జై భారత్ పార్టీ తరుపున షేక్ బాషా నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు. దీంతో 11మంది అభ్యర్థులు 16 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 25న గురువారం నామినేషన్లకు చివరి తేదీ కాగా, 26న పరిశీలిస్తారు. 29వరకు ఉపసంహరణకు గడువు ఉంది.

పొన్నూరు అసెంబ్లీకి 8 నామినేషన్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 24: పొన్నూరు శాసనసభ స్థానానికి బుధవారం 8 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి ఎ లక్ష్మీకుమారి తెలిపారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మూడుసెట్ల నామినేషన్‌ను దాఖలుచేశారు. నరేంద్ర కుమార్ సతీమణి ధూళిపాళ్ళ జ్యోతిర్మయి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేసారు. వైసీపీ అభ్యర్థి మురళీకృష్ణ అంబటి రెండు సెట్ల నామినేషన్లను అందచేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ మస్తాన్ వలీ, జైభీమారావు పార్టీ అభ్యర్థిగా మద్దు సాంబశివరావు నామినేషన్‌ను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గురువారం నామినేషన్ దాఖలకు ఆఖరి తేదీగా ఎన్నికల అధికారులు తెలిపారు.



ఆర్థికసాయం అందచేస్తున్న వడ్రంగి పనివార్ల సంఘం నాయకులు

కార్పెంటర్‌కు ఆర్థికసాయం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 24: అనారోగ్యంతో బాధపడుతున్న తోటి కార్పెంటర్లకు వడ్రంగి పనివార్ల సంఘం నాయకులు ఆర్థికసాయాన్ని అందించి ఆదుకున్నారు. పట్టణానికి చెందిన షేక్ మౌలాలికి బుధవారం సంఘం నాయకులు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందచేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో వడ్రంగి పనివార్ల సంఘం అధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, లక్ష్మీశ్రీనివాసరావు, షేక్ జానీ, దొప్పలపూడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సదాలక్ష్మీదేవిని సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● ఎంపీడీవో విష్ణుప్రసాద్

కొల్లిపర, ఏప్రిల్ 24: అత్యంత ప్రధానమైన వృతి ఉపాధ్యాయ వృత్తి అని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పినపాటి సదాలక్ష్మీదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జీవితాన్ని ఇస్తే ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర వహిస్తున్నట్లు తెలియజేశారు. ఎంఈవో సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సదాలక్ష్మీదేవిని అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, ఉపాధ్యాయులు సాయిబాబు, రవితేజ, కేదార్‌నాథ్, రవికిశోర్, సుగుణకుమారి, సూర్యకుమారి, కరీమూన్ తదితరులు పాల్గొన్నారు.



రెచ్చిపోతున్న వైసీపీ శ్రేణులు

● టీడీపీ ప్రచార వాహనాలే లక్ష్యంగా దాడులు

● మొన్న ఏటీ అగ్రహారం.. నేడు శ్యామలానగర్

● తమ ప్రాంతంలోకి రావద్దని హెచ్చరికలు



గాయపడిన ప్రచార రథం డ్రైవర్ జెట్టి శ్రీనివాస్



టీడీపీ ప్రచార రథంపై దాడికి పాల్పడిన నిందితులు

గుంటూరు, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార వైసిపి వర్గీయులు రెచ్చిపోతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో దాడులు, బెదిరింపులకు వెరవడం లేదు. ముఖ్యంగా పశ్చి మ వైసీపీ అభ్యర్థి విడదల రజిని వర్గీయులు తెలుగుదేశం పార్టీ ప్రచార రథాలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఏటి అగ్రహారం నాలుగో లైన్‌లో టీడీపీ పశ్చిమ అభ్యర్థి గళ్ళ మాధవి ఎన్నికల ప్రచారం ముగించుకున్న ప్రచార రథం తిరిగి వస్తున్న తరుణంలో ఏటి అగ్రహారం నాలుగో లైన్‌లో వైసీపీ వర్గీయులు డ్రైవర్‌పై దాడికి దిగారు. తమ పార్టీ ప్రచారం జరుగుతున్న మార్గంలోకి ఎందుకు వచ్చావు అంటూ గొడవ పెట్టుకొని దాడి చేసి కొట్టారు. ఈ ఘటనలో గాయపడిన బాధి తుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల వైసీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని నామినేషన్ సందర్భంగా మేడికొండూరు మండలం తురకపాలెం గ్రామా నికి చెందిన ఆలీ అనే వైసీపీ కార్యకర్త మద్యం మత్తులో గుంటూరు పార్ల మెంటు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపేస్తానంటూ తీవ్ర హెచ్చరికలు చేశాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే తాజాగా బుధవారం శ్యామలనగర్‌లో టీడీపీ ప్రచార రథంపై వైసీపీ వర్గీయులు దాడికి దిగారు. వైసీపీ కార్యా లయం వైపునకు టీడీపీ ప్రచార రథం తీసుకొచ్చి నిలపడం ఏమిటి అంటూ దాడికి దిగారు. డ్రైవర్ జెట్టి శ్రీనివాస్‌పై దాడి చేసి కొట్టారు. విష యం తెలుసుకున్న టీడీపీ కార్పొరేటర్ ఈరెంటి వరప్రసాద్ సిటీ బస్సు బాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఆయనను రక్షించేందుకు ఘటనా స్థలానికి వెళ్లారు. అయితే వైసీపీ శ్రేణుల దాడికి గురైన బాధితులైన శ్రీని వాస్ అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. డ్రైవర్‌పై దాడి చేసిన వారిని టీడీపీ నాయకులు నిలదీశారు. దీంతో విడదల రజిని కార్యాలయంలో ఉన్న వైసీపీ వర్గీయులకు, టీడీపీ నాయకులకు మధ్య పరస్పర వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే పథకం ప్రకారం వైసీపీ శ్రేణులు టీడీపీ నేతలను రెచ్చగొడుతూ వీడియోలు తీస్తూ ఆ తర్వాత తమ కార్యాలయంపైకి టీడీపీ వర్గీయులు దాడికి వచ్చారంటూ ఆయా వీడియోలను సివిజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వారే దాడి చేసి వారే ఫిర్యాదు చేయడం గమనార్హం. దీనిపై బాధితుడైన రథం డ్రైవర్ జెట్టి శ్రీనివాస్ కూడా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నప్పటికీ పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపారు. తమ డ్రైవర్‌పై దాడి చేసి చివరకు తమపై ఫిర్యాదు చేయడం దుర్మార్గమైన చర్య అని, ఇటువంటి విషయంలో పోలీస్ అధికారులు కూడా నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు తగిన న్యాయం చేయాలని కార్పొరేటర్ వరప్రసాద్ కోరారు. నిందితులపై తక్షణ మే కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే నగరంలోని పలు డివిజన్‌లలో కూడా తెలుగుదేశం పార్టీ ప్రచార రథాలకు వైసీపీ కార్యకర్తల నుంచి బెదిరింపులు వస్తున్నట్లు తెలుస్తోంది. తమ ప్రాంతంలో ప్రచార రథం తిరగడానికి వీల్లేదంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. నగరంలో నిష్ప క్షపాతంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కోరుతున్నారు

ఇదిలా ఉంటే ఎన్నికల అక్రమాలకు కళ్ళెం వేయడానికి ఎన్నికల కమిషన్ అమలులోకి తీసుకువచ్చిన సీవిజిల్ యాప్‌ను వినియోగించుకోవడంలో వైసీపీ ముందంజలో ఉంది. ఈ విషయంలో టీడీపీ పూర్తిగా విఫల మైనట్లు ఆ పార్టీ వర్గాలే వాపోతున్నాయి.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నూతలపాటి నాగరాజును పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

ఆర్‌వో కార్యాలయం వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్

తాడికొండ, ఏప్రిల్ 24: తాడికొండ ఆర్‌వో కార్యాలయం వద్ద పోలీసు ఓవర్ యాక్షన్ రోజు రోజుకు ఎక్కువ తుంది. నామినేషన్ల ప్రక్రియ జరుగుతుండనే వంకతో ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న తీరు పలు విమర్శలకు తావిస్తుంది. తాడికొండ మండలపరిషత్ కార్యాలయం ప్రాంగణం లో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. విద్యుత్‌శాఖ, హౌసింగ్, డీఆర్‌డీఏ, ఎన్‌ఆర్‌జీఎస్, ఎంపీడీవో, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర ముఖ్య కార్యాలయాలు మం డల ప్రజాపరిషత్ ప్రాంగణంలో ఉన్నాయి. దీంతో మండలంలోని ప్రజలు రకరకాల పనుల మీద ఇక్క డి వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి పనుల మీద వచ్చే అర్జీదారులను పోలీసులు అడ్డుకోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాదూరం నుంచి వచ్చాము లోపలికి పంపాలని బతిమిలాడినా నిబంధనలు ఉన్నాయని, ఆర్‌వో ఆదేశాలు అంటు దురుసుగా సమా ధానం చెప్పి పంపివేస్తున్నారు. అస లే వేసవి కాలం.. ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉండటం పోలీసులు అడ్డుకోవటంతో కూర్చోవటానికి నిలువ నీడలేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.